ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం ఘనంగా లబ్ధిదారులకు కౌన్సిలర్ సన్మానం



3లో

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ప్రేరణ అండర్ గ్రాడ్యుయేట్ కామర్స్ విద్యార్థుల కామర్స్ మీట్




3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 97 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 04 ఏప్రిల్ 2026

# ఉమ్మడి పౌరస్మృతితో చొరబాటు దారులకు చెక్

**వారు ఇక్కడ నాలుగేసి పెళ్లిళ్లు చేసుకోకుండా అడ్డుకట్ట**

**అసోం ఎన్నికల ప్రచారంలో అమిత్ షా**



**గువాహటి, ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి తో అడ్డుకునే వీలుంటుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. అస్సాంలోని గోల్‌పాడాలో శుక్రవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో అమిత్‌షా మాట్లాడుతూ, తిరిగి తాము అధికారంలోకి వస్తే అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. గిరిజనాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అస్సాం ముఖ్యమంత్రి హిమంత మిగతా2లో...

# గ్రూప్-1 ఆశావహులకు ఊరట

● సుప్రీం తీర్పును స్వాగతించిన సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ గ్రూప్-1 ఉద్యోగ నియామకాల విషయంలో భారత అత్యున్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నానని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇది ఉద్యోగ నియామకాల పట్ల తమ ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపుగా భావిస్తున్నానని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొలువుల కోసం ఏండ్లకు ఏండ్లు కండ్లు కాయలు కాచేలా ఎదురుచూసి, మిగతా2లో...

# ఎపిలో ఒక్కసారిగా మారిన వాతావరణం

**పలు జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం**

**ఈదురుగాలులు కూడా ఉంటాయని హెచ్చరిక**



**అమరావతి, ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అత్యవసర హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, మిగతా2లో...

# టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణ అగ్రగామి

● ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి ప్రోత్సహిస్తాం ● చేనేత, ముత్యాలకు పెట్టింది పేరు తెలంగాణ
● ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో సిఎం రేవంత్



**హైదరాబాద్, ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో నిర్వహించిన ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉంది. అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం. టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు.. చేనేతలకు జీవితం. దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. ప్రపంచంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారింది. చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం. పర్యావరణ పరిరక్షణెళి మా తొలి ప్రాధాన్యం అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన టెక్స్‌టైల్ రంగ ప్రముఖులకు స్వాగతం పలుకుతూ, తెలంగాణను ప్రపంచ వస్త్ర రంగ పటంలో అగ్రస్థానంలో మిగతా2లో...



# కల్తీ మామిడి పండ్లతో జాగ్రత్త

**- కార్బైడ్ మామిడి పల్లను గుర్తించండి: సజ్జన్నార్**

**హైదరాబాద్, ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** మామిడిపండ్ల సీజన్ ప్రారంభం అయ్యింది. నగరంలో నోరూరించే పళ్లు కనిపిస్తున్నారు. ఇదే అదనుగా కొందరు వ్యక్తులు కల్తీ మామిడి విక్రయాలకు పాల్పడటం ఆందోళనకు గురిచేసే విషయం. మామిడి పండ్లను కాల్షియం కార్బైడ్ రసాయనాలతో

మిగతా2లో...

# రాఘవచద్దాను తొలగిస్తూ ఆప్ నిర్ణయం

● సభలో మాట్లాడే అవకాశం ఇవ్వరాదని లేఖ ● ఆప్ తీరుపై మండిపడ్డ రాఘవ్ చద్దా ● ప్రజా సమస్యలపై గొంతెత్తితే తట్టుకోలేరా? ● వీడియో విడుదల చేసిన రాఘవ్ చద్దా



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చడ్డాను ఆ పదవి నుంచి ఆప్ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై ఆప్ ఎంపీ రాఘవ్ చడ్డా తాజాగా స్పందించారు. తానేం తప్పు చేశానంటూ పార్టీని బహిరంగంగా ప్రశ్నించారు. ఇలాంటి ప్రయత్నాలతో తన గళాన్ని అణచివేయగలరేమో మిగతా2లో...



# భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం

**అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' జలప్రవేశం**

**విశాఖలో ప్రారంభించిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**

**విశాఖపట్నం, ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. అత్యాధునిక యుద్ధ నౌక 'ఐఎన్ఎస్ తారాగిరి' శుక్రవారం జలప్రవేశం చేసింది. విశాఖ నేవల్ డాక్ యార్డులో జరిగిన కార్యక్రమంలో

మిగతా2లో...

# స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

- ఆనాడు మాట్లాడినా రేవంత్ ఇప్పుడు మాట్లాడడం లేదు
- టిఆర్ఎస్ పేరు ఖాళీగా ఉంది..ఎవరైనా వాడుకోవచ్చు
- జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్,ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో స్కూల్ ఫీజుల గొడవ నడుస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 39,640 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. వీటిలో 12,061 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. సీబీఎస్సీ సెంట్రల్ సిలబస్ ఉన్న స్కూల్స్‌లో 25 నుంచి 30 శాతం ఫీజులు పెంచి ఇప్పటినుంచే

మిగతా2లో...

# గిరిజనుల రిజర్వేషన్లు పెంచాం

## - తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చాం

**ఫీజు రియంబర్స్‌మెంట్ కూడా ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం: బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు**



**నారాయణపేట,ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** గిరిజనులకు ఉన్న 6 శాతం రిజర్వేషన్‌ని 10 శాతానికి పెంచిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనతా ఆయనకే దక్కుతుందన్నారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం బావోజీ జాతరకు మాజీ మంత్రులు హరీశ్ రావు, శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ..'లోక్ మసంద్ మహారాజ్ జాతరకు రావడం సంతోషంగా ఉంది. ఈ ప్రాంతానికి రూ.8 కోట్లతో బ్రిడ్జి వేయించింది మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి. ఈ దేవాలయ అభివృద్ధికి, గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ ఎంతో చేశారు. మా తండాలో మిగతా2లో...

# రెండో విడత రైతుభరోసాకు రంగం సిద్ధం

**పంపిణీ కోసం సుమారు రూ. 2,650 కోట్లు అవసరం**

**నిధులు సమకూర్చాలని సిఎం రేవంత్ ఆదేశం**



**హైదరాబాద్, ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణలోని సాగునీటి అవసరాలు, పెట్టుబడి కోసం ఎదురు చూస్తున్న రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. యాసంగి సీజన్ పెట్టుబడి సాయం కింద అందించే 'రైతు భరోసా' రెండో విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ముహూర్తం ఖరారైంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఒత్తిడిలో ఉన్నప్పటికీ, రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ అడుగు వేస్తోంది. రెండో విడత పంపిణీ కోసం సుమారు రూ. 2,650 కోట్ల భారీ మొత్తాన్ని సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, రుణాల చెల్లింపులు పూర్తయిన వెంటనే..

మిగతా2లో...

# ఎపిలో ఒక్కసారిగా మారిన వాతావరణం

(మొదటి పేజీ తరువాయి)

పోలవరం జిల్లాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా ఉండనుందని, ఆయా జిల్లాల యంత్రాంగం ఇప్పటికే అప్రమత్తమైంది.వర్షంతో పాటు గంటకు 40 నుండి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండవద్దని సూచించారు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో ఉన్నవారు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, పొలాల్లో పనిచేసే రైతులు, పశువుల కాపరులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రావొద్దని, ప్రయాణాలను వాయిదా వేసుకోవడం ఉత్తమమని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, నదీ పరివాహక ప్రాంతాల వారు స్థానిక అధికారుల సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరో వైపు తెలంగాణలోనూ రానున్న 3 రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో వర్షం పడే అవకాశముంది. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# రాఘవచద్దాను తొలగిస్తూ ఆప్ నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

గానీ.. తనను ఓడించలేరంటూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. పార్లమెంట్‌లో నాకు ఎప్పుడు మాట్లాడే అవకాశం లభించినా.. ప్రజా సమస్యలనే లేవనెత్తుతా. బహుశా నేను ప్రస్తావించే అంశాలను సభలో సాధారణంగా చర్చించరేమో. కానీ, ప్రజా సమస్యలను ఎత్తిచూపడం ఏమైనా నేరమా అని నిలదీశారు. నేనేమైనా తప్పు చేశానా? పార్లమెంట్‌లో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని మా పార్టీ స్వయంగా రాజ్యసభ సెక్రటరీకి చెప్పింది. అందుకే ఈ రోజు నేను ఈ ప్రశ్నలు అడగాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్టుల్లో ఆహార ధరలు, గిగ్ వర్కర్ల సమస్యలు, టోల్ ప్లాజా దోపిడీ, టెలికాం కంపెనీల రీఛార్జ్ విధానాల సమస్యలను లేవనెత్తితే.. అది ఆమ్‌ఆద్మీ పార్టీకే ప్రయోజనం కదా అని అన్నారు. మొన్నటికి మొన్న వివిధ రకాల పన్నులుపై నిలదీశారు. దీనివల్ల పార్టీకి ఏం నష్టం జరుగుతోంది? ఎందుకు నన్ను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు? ఇలాంటి చర్యలతో నా గళాన్ని మీరు అణచివేయగలరు. కాని, ఇది నా ఓటమి కాదు. ప్రజలు నా పక్షాన ఉన్నారు. వారికోసం ఎంత దూరమైనా వెళ్తా. నేను నది లాంటి వాడిని. సమయం వచ్చినప్పుడు వరదలా విరుచుకుపడతా అని రాఘవ్ చద్దా తన వీడియోలో పేర్కొన్నారు. రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా రాఘవ్ చద్దాను తొలగించిన ఆప్.. ఆ హోదాలో మరో ఎంపీ అశోక్ మిత్తల్‌ను నియమించింది. ఆప్ నిర్వహిస్తున్న కార్యకలాపాలకు చద్దా దూరంగా ఉంటుండటం, పార్టీ కార్యక్రమాలపై స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రాఘవ్ చద్దా భాజపాలో చేరనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తోన్న వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశ మైంది.ఎంపి రాఘవ చద్దాని ఉపనాయకుడి పదవి నుంచి తొలగించాలని గురువారం రాజ్యసభ సచివాలయానికి ఆ పార్టీ లేఖ రాసింది. సభలో రాఘవ చద్దాని మాట్లాడనివ్వకూడదని కూడా ఆ లేఖలో ఆప్ పేర్కొంది. దీనిపై ఆప్ ఎంపి రాఘవ్‌చద్దా శుక్రవారం స్పందించారు. పార్లమెంటులో ప్రజా సమస్యలను లేవనెత్తడం నేరమా? నేను ఏదైనా తప్పు చేశానా? అని ఆప్‌ని ప్రశ్నించారు. ఈ మేరకు ఓ వీడియోను ఆయన శుక్రవారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. నాకు ప్రజల మద్దతు ఉంది. నా మౌనాన్ని నా ఓటమిగా పొరపాటు పడకండి అని రాఘవ్ చద్దా వీడియోలో తెలిపారు.

# భారత నౌకాదళ అమ్ముల పొదిలో మరో అస్త్రం

(మొదటి పేజీ తరువాయి)


కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా దీన్ని కమిషన్ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్, నౌకాదళ అధిపతి దినేశ్ కె.త్రిపాఠి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. స్టెల్త్ సాంకేతికతతో రూపొందించిన ఈ ఫ్రిగేట్ భారత సముద్ర సరిహద్దు రక్షణలో కీలక పాత్ర పోషించనుంది. నీలగిరి శ్రేణి 17-ఏలో నాలుగో ప్రాజెక్టుగా ఈ యుద్ధనౌకను ముంబయిలోని మజగాన్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ (ఎండీఎల్)లో నిర్మించారు. స్వదేశీ ఆధునిక సాంకేతికత వినియోగంలో 75 శాతానికిపైగా సూక్ష్మ,చిన్న మధ్య తరహా పారిశ్రామిక రక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థలు భాగస్వామ్యం అయినట్లు నేవీ (ఎనిటతిజీని ఔజీలా) వర్గాలు పేర్కొన్నాయి. శత్రువుల రాడార్‌లకు కనిపించకుండా పనిచేసే సామర్థ్యం ఈ వార్‌షిప్ ప్రత్యేకత. ఐఎన్ఎస్ తారాగిరిని గతేడాది నవంబరు 28న నేవీకి అప్పగించారు.149 మీటర్ల పొడవు, 17.8 మీటర్ల వెడల్పుతో 6,670 టన్నుల బరువుండే ఐఎన్ఎస్ తారాగిరి కంబైన్డ్ డీజిల్/గ్యాస్ ఆధారిత ప్లాంటుతో సముద్ర జలాల్లో గంటకు 28 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు.ఇందులో నిశ్శబ్ద ఫిరంగులతో కూడిన ఆధునిక టెక్నాలజీ ఉంది. బరాక్-8 వంటి విమాన విధ్వంసక, 8 బ్రహ్మోస్ నౌకా విధ్వంసక క్షిపణులు ఇందులో ఉన్నాయి. యాంటీ సబ్‌మెరైన్ వార్ఫేర్ వ్యవస్థతోపాటు, శత్రువుల జాడను, ముప్పును ముందే పసిగట్టే రాడార్ వ్యవస్థ ఉంది.అరిదమన్ అనేది ఒక పదం కాదని.. ఒక శక్తి అని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. భారత్ మూడో స్వదేశీ అణు సబ్‌మెరైన్ అరిదమన్ అని తెలిపారు. దీంతో సముద్ర ఆధారిత అణు నిరోధకశక్తి మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో పని చేస్తున్న నావెల్ సైన్స్ అండ్ టెక్నాలజీ లెబోరెటరీ (ఎన్ఎస్‌టీఎల్)ను రాజ్‌నాథ్ సింగ్ సందర్శించారు. అందులోని కావిటేషన్ టన్నెల్‌కు సైతం ఆయన శంకుస్థాపన చేశారు. 2016లో ఐఎన్ఎస్ అరిహంత్, 2024 ఆగస్టులో ఐఎన్ఎస్ అరిఘాట్‌ల సరసన తాజాగా ఐఎన్ఎస్ అరిదమన్ చేరింది. అరిదమన్ చేరికతో.. అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గాములను సొంతంగా నిర్మించి, నిర్వహిస్తున్న అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, చైనా వంటి ఎంపిక చేసిన దేశాల క్లబ్‌లో భారత్ చేరింది. ఈ జలాంతర్గాములు శత్రువుల కంటపడకుండా నెలల తరబడి సముద్రగర్భంలో ఉంటాయి. శత్రు దేశాల నుంచి అణు దాడి జరిగితే.. సముద్రం లోపలి నుంచే దీటుగా ఇవి బదులిస్తాయి.

# టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణ అగ్రగామి

(మొదటి పేజీ తరువాయి)

నిలిపేందుకు ప్రభుత్వ దార్శనికతను పంచుకున్నారు.తెలంగాణకు వస్త్ర రంగంతో ఉన్న చారిత్రక అనుబంధాన్ని గుర్తుచేశారు. భారతదేశానికి అత్యుత్తమ వస్త్రాలను తయారు చేసిన గొప్ప చరిత్ర ఉంది. తెలంగాణ గర్వంగా చెబుతోంది.. టెక్స్‌టైల్ మన డిఎన్ఏలోనే ఉంది. నిజాం కాలంలోనే ప్రపంచ నలుమూలల నుండి వ్యాపారులు హైదరాబాద్ కు వచ్చి వస్త్రాలు, ముత్యాలు కొనుగోలు చేసేవారు అని ఆయన పేర్కొన్నారు. కేవలం పరిశ్రమగానే కాకుండా, ఇది లక్షలాది మందికి జీవనాధారమని.. పోచంపల్లి ఇక్కత్, గద్వాల్ చీరలు, వరంగల్ దుర్రీస్ వంటివి మన సంస్కృతికి ప్రతీకలని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047' గురించి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధిపై స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను వివరిస్తూ, 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌ను సీఎం ప్రకటించారు. ఇందులో భాగంగా 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగడమే లక్ష్యం అని పేర్కొన్నారు. ఇంకా 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాలోనే టెక్స్‌టైల్ రాజధానిగా మార్చడమే మా సంకల్పం అని అన్నారు. అలాగే వరంగల్‌లో ఏర్పాటు చేసిన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పత్తి నాణ్యతకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, పత్తి ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రగామిగా ఉందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా పెట్టుబడిదారులకు ఆయన పిలుపునిస్తూ.. 'మీకు విజన్ ఉంటే, మేము మీకు సరైన భాగస్వాములం. డీప్ టెక్, ఫార్మా, ఏరోస్పేస్ వంటి రంగాల్లో ఇప్పటికే ముందంజలో ఉన్న తెలంగాణ, ఇప్పుడు టెక్స్‌టైల్ ఎకోసిస్టమ్ ను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. మరోవైపు హైదరాబాద్ ఇప్పుడు ప్రపంచ సినిమా నిర్మాణ కేంద్రంగా ఎదుగుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలను ప్రారంభించడాన్ని ఆయన ప్రస్తావించారు. టాలీవుడ్, బాలీవుడ్ మాత్రమే కాక హాలీవుడ్ కూడా హైదరాబాద్ ను కేంద్రంగా చేసుకుంటున్న తరుణంలో సినిమా రంగానికి అవసరమైన ఫ్యాషన్ ను కూడా తెలంగాణ నుంచే అందించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు.

# కేరళంలో రేవంత్ అబద్ధాల ప్రచారం



- ఆరు గ్యారెంటీలపై అబద్ధాలతో మోసం
- కెసిఆర్ లాగే అబద్ధాల ప్రచారం అందుకున్న రేవంత్
- తెలంగాణలో అమలు చేయని పథకాలను ప్రచారం చేస్తారా..?
- ఇది క్షమించరాని మహాపరాథం...ప్రజలను మోసం చేసే యత్నం
- సిఎం రేవంత్ ప్రచారంపై మండిపడ్డ కిషన్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేరళంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధాల ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించారని, ఇది తెలంగాణ ప్రజలను మోసం చేయడమేనని రేవంత్ పర్యటనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రేవంత్ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు తెలంగాణలో పూర్తిగా విఫలమయ్యా యని.. ఒక్క పథకం కూడా సమర్థవంతంగా అమలు కాలేదన్నారు. అమలు చేయని పథకాలను అమలు చేసినట్టు చెప్పడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డివి మోసం చేసే రాజకీయాలు. గతంలో కేసీఆర్ ఎలా హామీలు ఇచ్చి అమలు చేయలేదో, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే మార్గంలో నడుస్తున్నారు. అమలు చేయకపోయినా 'చేశామని అనుకోండి' అనే ధోరణి ప్రమాదకరం అని హెచ్చరించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పారు, ఇచ్చారా?. పెన్షన్లు రూ.2,000 నుంచి రూ.4,000 చేస్తామని, దివ్యాంగులకు రూ.3,000 నుంచి రూ.6,000 చేస్తామని చెప్పారు, అమలు చేశారా?. దళిత కుటుంబాలకు రూ.12 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు.. ఇచ్చారా?. బీసీలకు రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పారు.. రెండు సంవత్సరాల పాలనలో ఒక్క ఏడాది కూడా రూ.20 వేల కోట్లు ఇవ్వలేకపోయారు. ఇవన్నీ కేరళ ప్రజలకు చెప్పగలరా?. తెలంగాణలో పెళ్లయిన ఆడబిడ్డలకు తులం బంగారం ఎక్కడ?. ఉచిత ఎలక్ట్రిక్ స్కూటర్లు ఎక్కడ?. నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ?. నిరుద్యోగ భృతి ఎక్కడ?. ఈ హామీలన్నీ ఎక్కడికి పోయాయి?. ఇవన్నీ చేయకపోయినా.. గ్యారెంటీలు అమలు చేశామని కేరళంలో రేవంత్ రెడ్డి చెప్పడం ఎంత పెద్ద మోసమో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ మాటలను నమ్మకండి. ఇప్పటికే లెఫ్ట్ పార్టీలు కేరళం ప్రజలను మోసం చేశాయి. గత 10 సంవత్సరాలుగా అభివృద్ధిని అడ్డుకున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ వస్తే అవినీతి మరింత పెరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డి మాటలకు కేరళంలో విలువ లేదు. ఆయన ఎందుకు అక్కడికి వెళ్లారో అందరికీ తెలుసు. తెలంగాణ నుంచి డబ్బులు పంపుతున్నారనే అనుమానాలు ప్రజల నుంచి వస్తున్నాయి. అందుకే ఆ పార్టీ నాయకులను అక్కడికి పిలుస్తున్నారు. ఉపన్యాసాలు ఇవ్వమని పిలుస్తున్నారు

# ఉమ్మడి పౌరస్మృతితో చొరబాటు దారులకు చెక్

(మొదటి పేజీ తరువాయి)

బిశ్వశర్మ సమగ్ర మ్యాప్ సిద్ధం చేశారని అమిత్‌షా తెలిపారు. దీనిని ముందుకు తీసుకువెళ్లి, సమర్ధవంతంగా అమలు చేయాలంటే బీజేపీకే ప్రజలు ఓటు వేయాలని కోరారు. మోదీ నాయకత్వంలో తొలిసారి గిరిజన మహిళ దేశ అధ్యక్షురాలు అయిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ ఆదివాసీ మహిళలను రాష్ట్రపతి చేయలేదని, మోదీ వచ్చాక పరిస్థితి మారిందని, ద్రౌపది ముర్మ దేశానికి తొలి పౌరురాలు అయ్యారని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతున్నారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. యూసీసీ నుంచి ఆదివాసీ ప్రాంతాలను మినహాయిస్తామని చెప్పారు. పొరుగున్న ఉన్న మేఘాలయాలో చొరబాటుదారులు ఇటీవల గరో హిల్స్ అటానమస్ జిల్లా కౌన్సిల్‌లో గిరిజన మహిళలను పెళ్లాడి రాజకీయ పలుకుబడిని సంపాదించే ప్రయత్నం చేశారని, ఇది ఉద్రిక్తతలకు దారితీసిందని అమిత్‌షా చెప్పారు. అస్సాంలో తమకు మరో ఐదేళ్లు అధికారం ఇస్తే యూజీసీని అమలు చేయడంతో పాటు చొరబాటుదారుల నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అస్సాంలో శాంతిని బీజేపీ పునరుద్ధరించిందని, కాంగ్రెస్ తిరిగి వచ్చినా, కొన్ని సీట్లలో నెగ్గినా కూడా తిరిగి రాష్ట్రంలో అస్థిరత నెలకొంటుందని హెచ్చరించారు. అస్సాం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# గ్రూప్-1 ఆశావహులకు ఊరట

(మొదటి పేజీ తరువాయి)

కన్నవారి కష్టంపై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేండ్లు కాలం వెళ్లదీసిన గ్రూప్-1 ఆశావహులకు ఇది పెద్ద ఊరట అని తెలిపారు. ప్రజా ప్రభుత్వం వచ్చీరావడంతోనే నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసిందని గుర్తు చేశారు. ఈ నియామకాలను అడ్డుకోవాలనుకున్న దృష్ట శక్తుల కుట్రలను కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్నిర్మాణంలో తొలి గ్రూప్-1 అధికారులుగా యువతను భాగస్వాములను చేశామని తెలిపారు. వారికి మరోసారి అభినందనలు ప్రకటించారు. ప్రభుత్వ ఆలోచనలు, సంకల్పానికి అనుగుణంగా టీజీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసి, నిరుద్యోగ యువతకు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించి, అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలను పూర్తి చేసిన టీజీపీఎస్సీ చైర్మెన్, ఉద్యోగులు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# రెండో విడత రైతుభరోసాకు రంగం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ఈ నిధులను సేకరించే పనిలో యంత్రాంగం నిమగ్నమైంది. మొత్తం రూ. 9,000 కోట్ల అవసరం ఉన్న ఈ పథకాన్ని, నిధుల లభ్యతను బట్టి ప్రభుత్వం మూడు విడతల్లో పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే ఎకరం లోపు ఉన్న రైతులకు మొదటి విడత నిధులు అందగా, ఇప్పుడు ఒకటి నుంచి ఐదు ఎకరాల వరకు సాగు భూమి ఉన్న రైతులకు ఈ నెల రెండో వారంలో నగదు జమ కానుంది. ఐదు ఎకరాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న రైతులకు ఈ నెలాఖరు కల్లా వారి వాటా నిధులు అందుతాయి. ప్రస్తుతం అమలులో ఉన్న విధానం ప్రకారం, ప్రతి ఎకరాకు సాగు ఖర్చుల కోసం ప్రభుత్వం రూ. 6,000 ఆర్థిక సాయం అందిస్తోంది. నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకే ఈ నగదు బదిలీ కానుండటంతో ఎక్కడా జాప్యం లేకుండా రైతులకు మేలు జరుగుతుంది.

# కల్తీ మామిడి పండ్లతో జాగ్రత్త

(మొదటి పేజీ తరువాయి)

కృత్రిమంగా పండించి విక్రయిస్తున్న వ్యాపారుల పట్ల జాగ్రత్త అవసరం. ఈ కల్తీ పండ్ల వల్ల ఆరోగ్య సమస్యలు రావడమే కాకుండా క్యాన్సర్ ముప్పు పొంచి ఉంటుందంటున్నారు నిపుణులు. ఈ విషయమై హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ.సజ్జనార్ ఎక్స్ వేదికగా స్పందించారు. వేసవి కాలం రాకతో మామిడి మార్కెట్‌లో సందడి చేస్తోందని సజ్జనార్ అన్నారు. అయితే.. నోరూరించే ఈ ఫలాల మాటున ప్రాణాంతకమైన విషకోరలు దాగున్నాయన్న నిజాన్ని ప్రజల మరవకూడదని హెచ్చరిస్తూ.. 'కల్తీ మామిడి పండ్లతో తస్మాత్ జాగ్రత్త!' అని ఎక్స్ వేదికగా వివరించారు. మార్కెట్లలో ఎక్కడైనా కల్తీ మామిడి పండ్లను విక్రయించినా, ఆ సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100కి గానీ, హెచ్-ఫాస్ట్ ఫోన్ నంబర్ 8712661212కు కాల్ చేయాలని సజ్జనార్ సూచించారు.

# గిరిజనుల రిజర్వేషన్లు పెంచాం

(మొదటి పేజీ తరువాయి)

మా రాజ్యం అంటే ఎవ్వరూ పట్టించుకోలేదు. తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌ది. అన్ని రంగాల్లో కేసీఆర్ వారికి రిజర్వేషన్లు తెచ్చారు. గిరిజనులకు ఇప్పుడు కాంగ్రెస్ చేసింది గుండు సున్నా. ఎస్సీ, ఎస్టీలకు డిక్లరేషన్ ఇచ్చి వారు చేసిందేమీ లేదు. రూ.2,730 కోట్లు ఎస్టీలకు బ్జడెట్‌లో పెట్టి కేవలం రూ.50 కోట్లే ఖర్చు చేశారు.గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు.. ఒక్కరికీ ఇవ్వలేదు. పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా విద్యకు దూరం చేస్తున్నారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.వేల కోట్లు ఇచ్చిందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కానీ, ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు కూడా ఇవ్వడం లేదని ఆక్షేపించారు. సంత్ సేవాలాల్ కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు ప్రకటించి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. ఎస్టీల ఓట్లు కావాలిగానీ, వాళ్ల సంక్షేమం పట్టించుకోరా?అని ప్రశ్నించారు. కేరళలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేశామని బడాయి మాటలు చెబుతున్నారని విమర్శించారు.

# స్కూల్ ఫీజుల నియంత్రణ చట్టం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

వసూలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు ఫీజు నియంత్రణ చట్టం చేయాలని రేవంత్ రెడ్డి పదే పదే మాట్లాడారని గుర్తుచేశారు. ఎవరెంత తిన్నారంటూ అసెంబ్లీలో చర్చ చేసుకున్నారే తప్ప ఫీజుల నియంత్రణపై మాట్లాడలేదని విమర్శించారు. ప్రత్యేక అసెంబ్లీ నిర్వహించి ఫీజు నియంత్రణ చట్టం వెంటనే తేవాలని కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఫీజులను పెంచుతున్నాయే తప్ప టీచర్లకు మాత్రం జీతాలు పెంచరని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీల్లో ఆహార నాణ్యతను ప్రభుత్వం పట్టించుకోదా అని ప్రశ్నించారు. ప్రైవేట్ పాఠశాలలు, ఆసుపత్రులను సీఎం ప్రారంభిస్తున్నారని... వాళ్ళ దోపిడిని ఎంకరేజ్ చేస్తున్నారా అంటూ నిలదీశారు. ప్రైవేట్ స్కూల్స్ దోపిడీని కంట్రోల్ చేయాలని ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే స్కూల్స్ ముందు ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. 'అన్ని శాఖలకు ముఖ్యమంత్రే మంత్రిగా ఉండటం మన కర్మ' అంటూ వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో తనను నిజామాబాద్‌కు పరిమితం చేశారని అన్నారు. ఆంధ్రా, నార్త్ ఇండియా వాళ్ళు ఇక్కడ విద్యా సంస్థలు నెలకొల్పినా తెలంగాణ వాళ్ళకే అవకాశం ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు.అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని.. అధిక ఫీజుల వసూళ్లను కట్టడి చేయాలని కోరారు.తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాత పేరు, కొత్త అజెండాతో ప్రజల ముందుకు వస్తానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్) పేరు ఫ్రీ అయిందని.. ఇప్పుడు దాన్ని ఎవరైనా వాడుకోవచ్చన్నారు. ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే తమ పార్టీ నడుస్తుందని చెప్పారు. తమ పార్టీకి బిహార్ సిద్ధాంతకర్త అంటూ ఎవరూ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని విమర్శించారు.

# తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ప్రేరణ అండర్ గ్రాడ్యుయేట్ కామర్స్ విద్యార్థుల కామర్స్ మీట్

**హనుమకొండ , ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** న్యూ సైన్స్ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో కామర్స్ విద్యార్థుల మీట్ జరిగినది. తెలంగాణ కామర్స్ అసోసియేషన్ రాష్ట్రస్థాయిలో విద్యార్థులలో కామర్స్ విద్యార్థులలో ప్రేరణ కలిగించేందుకై రాష్ట్రస్థాయిలో పోటీలను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో ఎంపికై వివిధ యూనివర్సిటీల స్థాయిలను పోటీలను నిర్వహించి అందు మొదటి మరియు ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు రాసిస్తాయి పోటీలు నిర్వహించడం జరుగుతుంది. ఎందుకుగాను ఇందుకుగాను కాకతీయ విశ్వవిద్యాలయ స్థాయిలో నిర్వహించే కామర్స్ అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల మీట్ నేడు న్యూ సైన్స్ డిగ్రీ కాలేజీలో ఘనంగా జరిగినది ఈ కార్యక్రమంలో సమావేశ అధ్యక్షులుగా పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజేశం వివరించారు వ్యవహరించారు న్యూ సైన్స్ డిగ్రీ మరియు పీజీ కళాశాల డైరెక్టర్ రవీందర్ రెడ్డి గారు సమావేశ వివరాలను తెలిపారు విశ్వవిద్యాలయ స్థాయిలో నిర్వహించే ఈ పోటీలలో నేడు ఈ కళాశాల ప్రాంగణంలో యూనివర్సిటీ పరిధిలోని కళాశాలల విద్యార్థిని విద్యార్థులు వివిధ పోటీలలో పాల్గొన్నారు కార్యక్రమానికి అధ్యాపకులను న్యాయనిర్ణేతలుగా ఆహ్వానించడం జరిగినది ఒక్కొక్క పోటీకి ముగ్గురు న్యాయ నిర్ణీతలు చొప్పున నియమించి కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమాలలో వ్యాసరచన పోటీ చైనీస్ విస్పర్ క్విజ్ జస్ట్ ఎ మినిట్ గ్రూప్ సాంగ్ గ్రూప్ డాన్స్ రీల్ టు రియల్ బెస్ట్ అవుట్ ఆఫ్ ద బెస్ట్ అనే పోటీలు నిర్వహించడం జరిగినది పోటీలలో గెలుపొందిన



మాట్లాడుతున్న సహాయచార్యులు డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్.

విద్యార్థులకు సర్టిఫికెట్లు మరియు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు కూడా సర్టిఫికెట్లు అందించడం జరిగినది ప్రోత్సాహకంగా ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డైరెక్టర్ రవీందర్ రెడ్డి గారు మాట్లాడుతూ నేడు డిగ్రీ కళాశాలలో కామర్స్ విద్యార్థుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నదని ఇది మంచి పరిణామం అని అభివృద్ధి చెందిన భారతదేశానికి చెందుతున్న వ్యాపార వాణిజ్య రంగాలలో కావలసిన వివిధ హోదాలను పనిచేసే ఉద్యోగుల యాజమాన్యాల అవసరం ఉన్నదని విద్యార్థిని విద్యార్థులు చాలా చురుగ్గా విద్యనభ్యసిస్తున్న అభ్యసిస్తున్నారని తెలియజేశారు ఈ కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయం వాణిజ్య శాస్త్ర విభాగం తమకు అభినంద్ అప్పగించడాన్ని అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు తదనంతరం ఈజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజేష్ రాజేశం మాట్లాడుతూ తెలంగాణ కామర్స్ అసోసియేషన్ విద్యార్థులకు మరియు అధ్యాపకులను అధ్యాపకులకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు ముఖ్యఅతిథిగా హాజరైన కాకతీయ విశ్వవిద్యాలయ వాణిజశాస్త్ర విభాగ బిఓఎస్ చైర్ పర్సన్ బిఓఎస్ మరియు తెలంగాణ కామర్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ వరలక్ష్మి గారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి న్యూసైన్స్ డిగ్రీ పీజీ కళాశాల అంగీకరించడాన్ని అభినందించినారు విద్యార్థిని విద్యార్థులకు నేడు మాణిక్య రంగంలో అనేక అవకాశాలు ఉన్నాయని వాణిజ్య విద్యార్థులు వాటిని అందిపుచ్చుకోవాలని తెలియజేశారు డాక్టర్ గంగిశెట్టి శ్రీనివాస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ కామర్స్ కాకతీయ ప్రభుత్వ కళాశాల అటానమస్ హనుమకొండ, తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ మాట్లాడుతూ గెలుపు అనేది ఒక రోజుతో సాధించేది కాదని ఓటమిని ద్వారా పాఠాలు నేస్తూ ఎదగాలని గెలవడం లక్ష్యంగా పెట్టుకోవాలని తెలియజేశారు అంతేకాకుండా మొదటి రెండు స్థానాల్లో నిలిచిన విద్యార్థిని విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రైసులు గెలుపొందాలని ఆకాంక్షించారు డిగ్రీ కళాశాల ప్రిన్సి పల్ డాక్టర్ సిహెచ్ కమలాకర్ వాణిజ్య శాస్త్ర విభాగ అధిపతి కార్యక్రమ ఇంచార్జ్ బి రమణ దేవి మరియు కే సబితా రెడ్డి అధ్యాపక బృందం వాలంటీర్లు ఎన్ఎస్-ఎస్ వాలంటీర్లు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మహనీయుల విగ్రహాల ముసుగులను వెంటనే తొలగించండి....

**• తిమ్మాపూర్ రాజకీయ, ప్రజాసంఘాల జెఎసి కమిటీ**

**తిమ్మాపూర్,ఏప్రిల్03(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రం, ఆర్ టీ సి బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన బాబు జగ్జీవన్ రాం, అంబేద్కర్ విగ్రహాలకున్నటువంటి ముసుగులను వెంటనే తొలగించాలని తిమ్మాపూర్ మండల రాజకీయ, ప్రజాసంఘాల జెఏసి సభ్యులు డిమాండ్ చేశారు. జేఏసీ సభ్యుల సమావేశంలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూగత మూడేళ్లుగా ముసుగులతో ఉండటం వల్ల ప్రజాస్వామ్య వాదులకు చాలా అవమానం జరుగుతుందని అన్నారు. ఈనెల 5 న మాజీ ఉప ప్రధాని స్వర్గీయ జగ్జీవన్ రాం జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్ లో నిర్వహించే ఉత్సవాలకు మండలం లోని అంబేద్కర్ వాదులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలు, బహుజన నాయకులు ప్రతీ ఒక్కరూ హాజరుకావాలని కోరారు. విగ్రహాల ముసుగుల తొలగించే విషయం లో ఒక కార్యాచరణ రూపొందించుకుందామని జెఏసి సభ్యులు మాతంగి శంకర్,సుగుర్తి జగదీశ్వరాచారి,



వంతడుపుల సంపత్, కనకం రాములు పేర్కొన్నారు.ఈ సమావేశం లో సముద్రాల లక్ష్మణ్,కొయ్యడ మురళి,హరీష్,ఎల్కపల్లి లక్ష్మణ్, పొన్నాల చిరంజీవి, జె. ప్రణయ్, ఆకుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.**తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కన్వీనర్ గా సముద్రాల లక్ష్మణ్ నియామకం...** తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం (1033) కరీంనగర్ జిల్లా కన్వీనర్ గా తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన సముద్రాల లక్ష్మణ్ ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు జెబి రావు తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.ఉన్నత చదువులు చదువుకున్న లక్ష్మణ్ అంబేద్కర్ భావజాలాన్ని గ్రామాల్లో ప్రచారం చేయడం లో ముందంజలో ఉన్నాడని గుర్తించిన రాష్ట్ర నాయకత్వం ఈ భాద్యతలను అప్పగించినట్లు పేర్కొన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంను అనుసరించి భారత దేశ పరిపాలన జరుతుందని కావున ఎక్కడ కూడా ప్రజలు అసమానతలకు గురికావద్దనే విషయాన్ని ప్రజలకు తెలిసేలా అవగాహన చేయాల్సిన భాద్యత తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులపై ఆదారపడి ఉన్నదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.సంఘం గౌరవ అధ్యక్షులు కనకం రాములు అభినందనలు తెలిపారు.



# గుడుంబా వ్యతిరేక ఫిర్యాదులపై ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం?

**ప్రజల ఆగ్రహం ఉధృతి స్పందించని అధికారులు**

**నాలుగు రోజులైనా చర్యలు లేవుడ ఫోన్‌కూ స్పందన లేదు**



**ములుగు జిల్లా,ఏప్రిల్03(పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో గుడుంబా అక్రమ వ్యాపారం విస్తరిస్తుండగా, దానిని అరికట్టాల్సిన ఎక్సైజ్ శాఖ వైఖరి తీవ్ర విమర్శలకు గురవుతోంది. గ్రామ ప్రజలు, యువకులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు స్పందించక పోవడంతో ప్రజల్లో ఆగ్రహం రోజురోజుకీ పెరుగుతోంది. గ్రామంలో గుడుంబా తయారీ, విక్రయాలు బహిరంగంగానే జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు కలిసి ఎక్సైజ్ శాఖకు లిఖితపూర్వక పిటిషన్ సమర్పించారు. అయితే పిటిషన్ ఇచ్చి నాలుగు రోజులు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. **అధికారులను సంప్రదించేందుకు విఫలయత్నాలు** స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, సమస్యపై స్పందన కోసం ఎక్సైజ్ శాఖ సిఐను ఫోన్ ద్వారా పలుమార్లు సంప్రదించేందుకు ప్రయత్నించినా కాల్స్‌కు స్పందన రాలేదని తెలిపారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి ప్రజల్లో అసహనం పెంచుతోంది.**గ్రామంలో పెరుగుతున్న గుడుంబా భయం** గ్రామంలో గుడుంబా తయారీ కేంద్రాలు పెరుగుతున్నాయని, కొన్ని ప్రాంతాల్లో రాత్రివేళల్లో విక్రయాలు బహిరంగంగా సాగుతున్నాయని సమాచారం. దీని వల్ల యువత దారి తప్పుతున్నారని, కుటుంబాల్లో కలహాలు, ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని గ్రామ పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గుడుంబా సేవనం వల్ల ఇప్పటికే పలువురు ఆరోగ్య సమస్యలకు గురయ్యారని స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం పరిస్థితిని మరింత ప్రమాదకరంగా మారుస్తోందని అభిప్రాయపడుతున్నారు. **మౌఖిక ఫిర్యాదులకు కూడా స్పందన లేదు** స్థానికులు పలుమార్లు మౌఖికంగా కూడా అధికారులకు సమస్య వివరించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర నిరాశ కలిగిస్తోంది. "ఫిర్యాదు చేస్తే స్పందిస్తారని భావించాం, కానీ ఇప్పటికీ ఎలాంటి మార్పు కనిపించడం లేదు" అని గ్రామస్తులు వాపోతున్నారు.**ఎక్సైజ్ శాఖపై తీవ్ర విమర్శలు** ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉన్న ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. ఫిర్యాదులను పట్టించుకోకపోవడం, ఫోన్ కాల్స్‌కు స్పందించకపోవడం అధికారుల పనితీరుపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. **ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి** ఈ సమస్యపై తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఎక్సైజ్ శాఖను అప్రమత్తం చేయాలని ప్రజలు కోరుతున్నారు. గుడుంబా తయారీ, విక్రయాలను పూర్తిగా అరికట్టాలని, ఇందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.**చర్యలు లేకపోతే ఆందోళనలకు సిద్ధం**త్వరలో చర్యలు తీసుకోకపోతే గ్రామ ప్రజలు ఆందోళన కార్యక్రమాలకు దిగే అవకాశముందని సంకేతాలు ఇస్తున్నారు. అవసరమైతే రహదారి నిరోధాలు, పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని యువకులు హెచ్చరిస్తున్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను బలోపేతం చేద్దాం





**కరీంనగర్ : ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :**తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత అధ్యాపకులదే అని తెలంగాణ కళాశాల విద్యా ఐకాస చైర్మన్ డాక్టర్ కే సురేందర్ రెడ్డి. పిలుపునిచ్చారు.జఖవీ కళాశాలలో పనిచేస్తూ ప్రభుత్వంచే టేకోవర్ అయి వివిధ ప్రభుత్వ కళాశాలల్లో నియామకం పొందిన 20 మంది అధ్యాపకులు ఈరోజు కరీంనగర్లో TGCGTA రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు కళాశాల విద్యా ఐకాస చైర్మన్ డాక్టర్ కడారు సురేందర్ రెడ్డిని కలిసి సంఘ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు కళాశాలల బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి తెలిపారు.డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ, అధ్యాపకుల హక్కులు, సంక్షేమం, విద్యా ప్రమాణాల అభివృద్ధి కోసం TGCGTA నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఎక్కువ మంది అధ్యాపకులు సంఘంలో చేరడం వల్ల సంఘం మరింత బలపడుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, ప్రస్తుత విద్యా రంగ సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి సంఘం ద్వారా ఐక్యంగా ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జె చిన్నా, కాకతీయ విశ్వవిద్యాలయం కో–ఆర్డినేటర్ రామక్రిష్ణా రెడ్డి, జిల్లాల బాధ్యులు ప్రొఫెసర్ ఎ. శ్రీనివాస్, జి శ్రీనివాస్ రెడ్డి, వెంకన్న, రవికుమార్, సత్యప్రకాష్, రాజయ్య, అనిల్ కుమార్, భగీరథుడు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం ఘనంగా లబ్ధిదారులకు కౌన్సిలర్ సన్మానం



**పరకాల, ఏప్రిల్ 03 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలోని 22వ వార్డులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఇందిరమ్మ ఇల్లు' పథకం కింద నిర్మించిన గృహానికి గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్ అల్లే దశరథం హాజరై లబ్ధిదారులు గడ్డం ఉమాదేవిసంతోష్ దంపతులను శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను నెరవేర్చడంలో ఇందిరమ్మ ఇల్లు పథకం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రతి అర్హులైన కుటుంబానికి గృహ వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.కార్యక్రమంలో కేశబోయిన అజయ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పోరండ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రకుంట స్మశాన వాటికకు నూతన కమిటీ... బస్తి వాసుల ఏకగ్రీవ నిర్ణయం అభివృద్ధి పనులకు శ్రీకారం



**ఉప్పల్, ఏప్రిల్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** ఎర్రకుంటలోని హిందూ స్మశాన వాటిక అభివృద్ధి, నిర్వహణను మెరుగుపర్చే ఉద్దేశంతో బస్తి వాసులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో స్థానికులు విస్తృతంగా పాల్గొని కమిటీ ఏర్పాటుపై చర్చించి తుది నిర్ణయం తీసుకున్నారు.ఈ కమిటీలో శ్రీమూర్తి నాగరాజును అధ్యక్షుడిగా, ఎడ్ల కార్తీక్‌ను ప్రధాన కార్యదర్శిగా, కొమ్మగాళ్ల కౌశిక్‌ను కోశాధికారిగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు స్మశాన వాటికలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, శుభ్రత నిర్వహణ, ప్రజలకు సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.సహకారం అందిస్తామని హామీఈ కార్యక్రమంలో ఎర్రకుంట బస్తి నివాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. కమిటీ అభివృద్ధి కార్యక్రమాలకు తాము పూర్తి సహకారం అందిస్తామని స్థానికులు హామీ ఇచ్చారు.

# హైకోర్టు ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలి

**• ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్**

**• బి.ఎస్.పి ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షులు మింద్రాల నర్సింగరావు**



**ఉప్పల్, ఏప్రిల్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, హైకోర్టు తీర్పును గౌరవించాలని బహుజన సమాజ్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షులు మింద్రాల నర్సింగరావు కోరారు.తెలంగాణ ఉద్యమకారుల త్యాగాల ఫలితంగా రాష్ట్రం ఏర్పడిందని, అలాంటి ఉద్యమకారులను ప్రభుత్వాలు విస్మరించడం సిగ్గుచేటు అని ఆయన విమర్శించారు. తెలంగాణ చట్టసభల్లో బిల్లు ప్రవేశపెట్టడంలో బీఎస్పీ పార్టీ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు.మాయావతి మద్దతు గుర్తు చేసిన నర్సింగరావుబీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టిన సమయంలో రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.ఉద్యమకారుల పట్ల నిర్లక్ష్యం తగదుఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదని, వారి త్యాగాలను గౌరవిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని నర్సింగరావు సూచించారు.ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు కల్పించాలిఉద్యమకారులకు భూములు, ఇళ్ల పట్టాలు, పింఛన్లు తదితర సదుపాయాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు చేపడతామని నర్సింగరావు హెచ్చరించారు.

# హనుమాన్ జయంతి సందర్భంగా దత్తాత్రేయ స్వామిపాదాలు ప్రతిష్ఠాపన మహోత్సవం




**గంగాధర ఏప్రిల్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండలంలోని వ్యతిరే ఎక్స్ రోడ్ దగ్గర శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా పౌర్ణమి రోజున శ్రీ శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయం వెదిర ఎక్స్ రోడ్ ఆలయ పూజారి బండారి చంద్రయ్య ఆధ్వర్యంలో స్వాతి సుశీల కళ్యాణ్ రామ్ దంపతులు హిమ్మత్ నగర్ వాస్తవ్యులు శ్రీ స్వామివారి శ్రీ దత్తాత్రేయ స్వామి వారి ఉత్సవమూర్తి మరియు పాదాలు పునప్రతిష్ఠించడం జరిగినది. ప్రతి పౌర్ణమి రోజు అన్నదానము యధావిధిగా చేసినాము ఇట్టి కార్యక్రమాన్ని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినారు.

# పట్టుదలతో చదివితే ఉన్నత లక్ష్యాన్ని సాధించవచ్చు...

**- ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారు యాదగిరి శేఖర్ రావు.**







**రామడుగు ఏప్రిల్ 02(పిసిడబ్ల్యూ న్యూస్):** విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చు అని ట్రస్మా రాష్ట్ర ముఖ్య సలహాదారు యాదగిరి శేఖర్ రావు విద్యార్థులకు సూచించారు.. రామడుగు మండల కేంద్రంలోని విన్నర్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ పాఠశాల ఆవరణలో గురువారంరాత్రి వార్షికోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగ యాదగిరి శేఖర్ రావు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం అర్బన్ ప్రాంతాల నుండి కాకుండా గ్రామీణ పేద విద్యార్థులే ఉన్నత లక్ష్యాలను సాధిస్తున్నారని అన్నారు.. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఉర్రూతలూగించారు..ఈ కార్యక్రమంలో ట్రస్మ రాష్ట్ర ముఖ్య సలహాదారు యాదగిరి శేఖర్ రావు ప్రగతి హై స్కూల్ కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణ సరస్వతి హై స్కూల్ ఉపాధ్యాయుడు ఉప్పుల శ్రీనివాస్ రామడుగు మాజీ సర్పంచ్ పంజాల ప్రమీల జగన్ మోహన్ గౌడ్ శ్రీరాములపల్లి మాజీ సర్పంచ్ వెంకటరమణారెడ్డి ఉపాధ్యాయుల బృందం తల్లిదండ్రులువిద్యార్థులు పాల్గొన్నారు.

# సర్పంచ్ ఉప్పలయ్య చేతుల మీదుగా చలివేంద్రం ప్రారంభం


**- బాలవికాస ఆధ్వర్యంలో జలదానం గ్రామ ప్రజలకు చల్లని నీటి ఉపశమనం**

**నర్సింహులపేట ఏప్రిల్ 02(పిసిడబ్ల్యూ న్యూస్):** నర్సింహులపేట మండలంలోని పడమడగూడెం గ్రామంలో పెరుగుతున్న వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బాలవికాస ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఉప్పలయ్య ప్రారంభించారు. వేసవిలో బాటసారులు, రైతులు, కూలీలు, వృద్ధులకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ప్రతి రోజూ పరిశుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రజలు తరచూ నీరు తాగాలని సూచించారు. ఈ చలివేంద్రం గ్రామస్థులకు ఉపశమనం కలిగిస్తూ, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్లు కందుకూరు సుకన్య, స్వర్ణత, ఉపసర్పంచ్ నవీన్ రెడ్డి, వార్డు సభ్యులు వెంకటమ్మ, యాకయ్య, సుజాత, హేమలత, ఆసియా బేగం, స్వామి నాయక్, యాకన్నతో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

# నారాయణపూర్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

**ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి దశలవారీగా నారాయణపూర్ రిజర్వాయర్ ముంపు బాధితులను ఆదుకుంటాము**

**15 రోజుల్లో నారాయణపూర్ గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడుతాం: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**




**గంగాధర ఏప్రిల్ 3( పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్ క్రింద ఇండ్లు కోల్పోయి పరిహారం మంజూరైన లబ్ధిదారులు సోమవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను గంగాధర మండలం మధురానగర్ ప్రజా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.పరిహారం మంజూరు చేయించిన ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేసిన నారాయణపూర్ ముంపు బాధితులు గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ క్రింద ముంపునకు గురవుతున్న నిర్వాసితులను అన్ని రకాలుగా ఆదుకొని న్యాయం చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. నారాయణపూర్ రిజర్వాయర్ క్రింద ఇండ్లు కోల్పోయి, పరిహారం మంజూరైన లబ్ధిదారులు శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను గంగాధర మండలం మధురానగర్ లోని ప్రజా కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే ను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నారాయణ పూర్ గ్రామస్తులను దశలవారీగా ఆదుకోవడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి గ్రామస్తులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. 15 రోజుల్లో నారాయణపూర్ గ్రామంలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడుతామని తెలిపారు. రిజర్వాయర్ క్రింద ఉన్న ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామడుగు మల్లేశం,బాబు మల్లేశం,బుర్ర కిరణ్, గడ్డం కార్తిక్,రాగుల మల్లయ్య,నరాల శ్రీనివాస్,లోకిని తిరుపతి ,బాబు నవిన్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మాపురం టు అయోధ్య వెళ్లిన ఆర్టీసీ బస్సు

**- 3000 కిలోమీటర్లు, 6 రోజుల ప్రయాణం, ఒకరికి 6,500 రూపాయలు**





**తొర్రూరు ప్రతినిధి, ఏప్రిల్ 3(పిసిడబ్ల్యూ న్యూస్):** అమ్మాపురంలోని కోదండ రామాలయం స్వయంభుగా వెలసిన రామాలయం ఆ గ్రామంలో ఉండటంతో అనేకమంది భక్తులు ఆ గ్రామంలో ఉన్నారు. వారి ఆలోచన ప్రకారం గా రామ జన్మభూమి అయోధ్యకు వెళ్లి చూసి రావాలని ఆలోచనతో సంకల్పాలని పెట్టుకున్న గ్రామస్తులు అయోధ్య రామ మందిరాన్ని చూసేందుకు శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి తొర్రూర్ టి జి ఎస్ ఆర్ టి సి బస్సు డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సులో బయలుదేరి వెళ్లారు. పి సి డబ్ల్యూ న్యూస్ జర్నలిస్టు మనోహర స్వామి అయోధ్యకు బయలుదేరిన భక్తులను పలకరించగా రామ జన్మభూమి రామాలయం వారణాసి మూడు నాలుగు పుణ్యక్షేత్రాలు ఒకే ప్రాంతంలో ఉండటం చూసి రావాలని ఆలోచనతో గ్రామస్తులు కొందరం అనుకొని సూపర్ లగ్జరీ బస్సును మాట్లాడుకోవడం జరిగిందని తెలిపారు. సుదూర ప్రాంతమైనప్పటికీ అడగగానే బస్సును సమకూర్చినందుకు డిపో మేనేజర్ పద్మావతికి వారు ధన్యవాదాలు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా, తోరూర్ మండలంలోని అమ్మా పురం గ్రామం నుండి ఉదయం 11 గంటలకు ఆ గ్రామ సర్పంచ్ సునీత వీరారెడ్డి తో పాటు బస్ డిపోకు చెందిన ఎస్.టి.ఐ రజిత రెడ్డి, ఏ డి సీలు ప్రారంభించారు. ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ రెండు రాష్ట్రాల్లోని ఐదు పుణ్యక్షేత్రాలు దర్శించుకొని ఆరో రోజుకి అమ్మాపురం కు బస్సు చేరుతుందని ఎస్ టి ఐ రజిత రెడ్డి పేర్కొన్నారు. బస్సుమూడు వేల కిలోమీటర్లు ప్రయాణిస్తుందని మూడు రాత్రులు బస్సు ప్రయాణం కొనసాగుతుందని పెద్దవారికి 6500 చొప్పున ధరను నిర్ణయించడం జరిగిందని అన్నారు మొత్తం బస్సులో 36 మంది ప్రయాణికులు బయలుదేరి వెళ్లినట్లుగా పేర్కొన్నారు. ప్రయాణంలో వెళ్లిన వారందరికీ వారి బంధువులు క్షేమంగా వెళ్లి లాభంగా తిరిగి రావాలని కోరారు.

# ఉప్పల్ మీడియా క్లబ్ నూతన కమిటీకి ఘన సత్కారం

**మీడియా ఐక్యతతో సమాజానికి మేలు**

**నూతన కమిటీకి అభినందనలు తెలిపిన పిల్లి నాగరాజు ముదిరాజ్, జితేందర్ రెడ్డి, పంగ మహేందర్ రెడ్డి, పంగ రాజేశ్వర్ రెడ్డి**



**ఉప్పల్, ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఉప్పల్ ప్రాంతంలో మీడియా ఐక్యతకు ప్రతీకగా నిలుస్తున్న ఉప్పల్ మీడియా క్లబ్ (ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా) అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఉప్పల్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పిల్లి నాగరాజు ముదిరాజ్ వారి కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా పిల్లి నాగరాజు ముదిరాజ్, పూదూరి జితేందర్ రెడ్డి, పంగ మహేందర్ రెడ్డి, పంగ రాజేరాశ్వర్ రెడ్డి, మాట్లాడుతూ సమాజంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని, ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే బాధ్యత మీడియాపై ఉందని తెలిపారు. మీడియా ఐక్యతతో పనిచేస్తే ప్రజలకు మరింత న్యాయం జరిగే అవకాశముందని పేర్కొన్నారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. నిజాయితీతో వార్తలను ప్రజలకు అందిస్తూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.అదేవిధంగా ఉప్పల్ మీడియా క్లబ్ అధ్యక్షుడు వడ్డేపల్లి కిషోర్, ప్రధాన కార్యదర్శి ఆనంద నరసింహారెడ్డి లు మాట్లాడుతూ, మీడియా ఐక్యతతోనే సంస్థ బలపడుతుందని, సభ్యులందరూ కలిసి పనిచేస్తే ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించగలమని తెలిపారు. భవిష్యత్తులో మీడియా ప్రతిష్టను మరింత పెంచేలా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు మీడియా ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# పాఠశాల భూమి ఆక్రమణపై సంచలనం

**• నెలలుగా సాగుతున్న ఆక్రమణ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు**

**• హెడ్మాస్టర్, ఎంఈఓపై చర్యల డిమాండ్**



**ములుగు జిల్లా,ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని మానసపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న 12వ వార్డు ప్రాథమిక పాఠశాల భూమి ఆక్రమణ ఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. ప్రభుత్వానికి చెందిన పాఠశాల స్థలాన్ని కొంతకాలంగా కొందరు వ్యక్తులు ఆక్రమిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆక్రమణకు స్పష్టమైన ఆనవాళు పాఠశాల పక్కనున్న ఖాళీ స్థలాన్ని గ్రీన్ నెట్‌తో చుట్టి, మట్టి మోపులు వేసిన పరిస్థితి కనిపిస్తోంది. ఈ భూమి పాఠశాల పరిధిలో భాగమని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.అధికారుల విచారణ హెడ్మాస్టర్ అంగీకారంవిషయం బయటకు రావడంతో పైస్థాయి అధికారులు పాఠశాలను సందర్శించి ప్రాథమిక విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ సమ్మయ్య ఆక్రమణ జరిగిన విషయాన్ని అంగీకరించినట్లు తెలిసింది.అయితే, "ఇంతకాలం ఫిర్యాదు ఎందుకు చేయలేదు?" అనే ప్రశ్నకు "పై అధికారులకు సమాచారం ఇచ్చాం" అని సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది.ఎంఈఓపై విమర్శలుమండల విద్యాధికారి (ఎంఈఓ) మల్లయ్య పాత్రపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలల పర్యవేక్షణ, పరిస్థితుల పరిశీలన ఆయన బాధ్యతగా ఉండగా, నెలలుగా జరుగుతున్న ఆక్రమణపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.అవినీతి ఆరోపణలు"హెడ్మాస్టర్, ఎంఈఓ ఇద్దరూ నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా, చేతులు కలిపినట్టుగా అనుమానం కలుగుతోంది" అని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.పాత రికార్డులు వెలుగులోకి?20022004 కాలానికి చెందిన పాఠశాల భూమి సరిహద్దుల ఫోటోలు, రికార్డులు స్థానికుల వద్ద ఉన్నట్లు సమాచారం. వీటిని పరిశీలిస్తే అసలు భూమి పరిమితి బయటపడుతుందని గ్రామస్థులు చెబుతున్నారు.పాత బడి భూమి ఎక్కడ?"ప్రస్తుతం ఉన్న రెండు పాఠశాల స్థలాలు కొత్తవని పేర్కొంటున్న గ్రామస్థులు, పాత పాఠశాల భూమి గల్లంతైందని ప్రశ్నిస్తున్నారు.ఉన్నతాధికారుల జోక్యం కోరుతూఈ ఘటనపై జిల్లా స్థాయి అధికారులు తక్షణం స్పందించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.జిల్లా కలెక్టర్‌జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)ఎమ్మార్వోగ్రామపంచాయతీ అధికారులుసమగ్ర విచారణ జరిపి నిజాలు వెలుగులోకి తేవాలని కోరుతున్నారు.కఠిన చర్యల డిమాండ్ హెడ్మాస్టర్, ఎంఈఓపై కఠిన చర్యలుఅవసరమైతే సస్పెన్షన్ఆక్రమణ తక్షణ తలగింపుఅని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఆందోళనలకు హెచ్చరికతక్షణ చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని గ్రామస్థులు హెచ్చరించారు.

# అమరవాదిని అభినందించిన మంత్రి తుమ్మల



**కల్లూరు, ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా గెలుపొందిన అమరవాది లక్ష్మీనారాయణ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆర్యవైశ్య జిల్లా మహాసభ అధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా భద్రాచలం రాములవారి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా అమరవాది మాట్లాడుతూ రాజకీయాలలో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కల్పించాలని కోరిన మీదట కాంగ్రెస్ ప్రభుత్వం మీ ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరావు హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పసుమర్తి చంద్రావు, మెట్ పల్లి మున్సిపల్ చైర్మన్ లింబాద్రి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు పోలా సుధాకర్, రాష్ట్ర మహాసభ కార్యదర్శి చారుగుండ్ల వి ఎల్ నరసింహారావు తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రజాసేవ చేసాము కబ్జాలు చేయలేదు: బండారి లక్ష్మారెడ్డి

- నిలువెత్తు సేవకు నిదర్శనం మాజీ శాసనసభ్యులు బండారి రాజిరెడ్డి
- ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డి పేరు పెట్టడం అంటే ఆయన సేవలను గుర్తించడమే
- సొంత నిధులతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసిన మహానేత బండారి రాజిరెడ్డి
- ఎంతో మందికి రాజకీయంగా ఎదుగుదలను ఇచ్చిన నేత బండారి రాజిరెడ్డి



**ఉప్పల్ ఏప్రిల్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉప్పల్ నారపల్లి కారిడార్ పేరు రాజకీయాలకు బలి కాకూడదు ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్‌కు దివంగత నేత బండారి రాజిరెడ్డి పేరు పెట్టడంపై మాజీ ఎమ్మెల్యే మీద విమర్శలు గుప్పించారు.కానీ ఇది కేవలం పేరు వివాదం కాదు ప్రజల భావోద్వేగాలపై జరుగుతున్న రాజకీయ ఆట అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మండిపడ్డారు.ఇది ఒక పేరు కాదు నిలువెత్తు ఒక సేవా చరిత్ర కు నిలువెత్తు స్మారకం అని ఆయన అన్నారు.ఈ సందర్భంగా కాప్రా లో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దాదాపు 150 కోట్ల తో CMRF తో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగింది అని ఆయన అన్నారు.మంత్రి తో మాట్లాడి వర్క్ మంజూరు చేయడం జరిగింది అని ఆయన అన్నారు.రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ పై నిప్పులు చెరిగారు.ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డి పేరు పెట్టడాన్ని మాజీ ఎమ్మెల్యే వ్యతిరేకించడం పట్ల తీవ్రంగా ఖండించారు.బండారి రాజిరెడ్డి మున్సిపల్ చైర్మన్ గా, ఎమ్మెల్యేగా, టీటీడీ బోర్డు మెంబర్ గా ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి పనులు చేశారని పేర్కొన్నారు. ఆ సేవలకు గుర్తింపుగా ప్రజల కోరిక మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆయన పేరు పెట్టడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. వాజపేయి పేరును జాతీయ రహదారికి పెట్టాలని సూచించారు. బీజేపీ మాజీ ఎమ్మెల్యే అర్థరహితంగా మాట్లాడటం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని బండారి లక్ష్మారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మాకు బీజేపీపై ద్వేషం లేదు దేశానికి సేవ చేసిన అటల్ బిహారీ వాజపేయి పట్ల అపారమైన గౌరవం ఉంది. అలాంటి మహానేత పేరు పెట్టాలంటే మేమే ముందుంటాం!అని స్పష్టం చేశారు.అయితే వెంటనే గట్టిగా హెచ్చరించారు.అందరూ మౌనంగా ఉన్నప్పుడు ఒక్కరే వ్యతిరేకించడం వెనుక ప్రజాహితం లేదు, రాజకీయ లాభాలే కనిపిస్తున్నాయి!ఇంకా తీవ్రంగా స్పందిస్తూనేను ఎప్పుడూ అక్రమాలకు పాల్పడలేదు, నీలాగా పార్కులు కబ్జా నా రాజకీయాలు కావు! అంటూ బీజేపీ మాజీ ఎమ్మెల్యేపై ఘాటు విమర్శలు చేశారు.దివంగత బండారి రాజిరెడ్డి గురించి మాట్లాడుతూ ఎమ్మెల్యే గా వున్న సమయం లో స్వంత నిధులతో రోడ్లు వేయడం భవనాలు కట్టివ్వడం జరిగింది అని ఆయన అన్నారు.ప్రజల కోసం బ్రతికిన నాయకుడు ప్రజల కోసం పోరాడిన మహానేత అలాంటి వ్యక్తి పేరును వ్యతిరేకించడం అంటే ప్రజల మనసును అవమానించడం! అని అన్నారు.అభివృద్ధికి రాజకీయ రంగు వేయొద్దు ప్రజల భావోద్వేగాలతో ఆటలాడొద్దు అధికారంలో ఉన్నా లేకపోయిన ప్రజల కోసం నిధులు తీసుకురావడం మా బాధ్యత మా పోరాటం ఆగదు!అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.

# వివాహ వేడుకలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

- నవవధూవరులను ఆశీర్వదించిన మార్కెట్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, ఒడిసిఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ గోల్కొండ సదానందం



**పరకాల, ఏప్రిల్ 03 (పిసీడబ్ల్యూ న్యూస్) :** పరకాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి సోదరుడు కట్కూరి ఆదిరెడ్డి పుత్రిక వివాహ వేడుక శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు నియోజకవర్గంలోని పలువురు ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరై నవవధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలో పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, ఓడిసిఎంఎస్ వైస్ చైర్మన్ గోల్కొండ సదానందం పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు.వారి వెంట కాంగ్రెస్ నాయకులు పొరండ్ల సంతోష్, పసుల రమేష్, దాసరి బిక్షపతి, కొత్తపెల్లి రవీందర్, దావు పరమేశ్, బొచ్చు మోహన్ తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా నాయకులు కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించి, వివాహ వేడుకలో సందడి చేశారు. ఈ వేడుకకు భారీ సంఖ్యలో కార్యకర్తలు, బంధుమిత్రులు హాజరయ్యారు.

# ఏటూరునాగారంలో ఇసుక అక్రమ రవాణా రెచ్చిపోతోంది!

- 'ఇందిరమ్మ' పేరుతో దందా? అధికారుల అండ ఉందా అనే అనుమానాలు
- రాత్రివేళ ట్రాక్టర్ల దందాతో గ్రామస్తులకు నిద్రలేకుండా ఇబ్బందులు









**ములుగు జిల్లా, ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ములుగు జిల్లా ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇసుక అక్రమ రవాణా రోజురోజుకీ పెరిగిపోతోంది. "ఇందిరమ్మ" పేరుతో కొందరు వ్యక్తులు అధికారుల అండతో రాత్రివేళల్లో భారీగా ఇసుక తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.రాత్రిళ్లు పది ట్రాక్టర్లతో దందాగ్రామస్తుల సమాచారం ప్రకారం, ప్రతిరోజూ రాత్రి పది ట్రాక్టర్లకు పైగా ఇసుక రవాణా జరుగుతోంది.ఈ ట్రాక్టర్లు గ్రామ వీధుల గుండా తిరగడంతో భారీ శబ్ద కాలుష్యం రోడ్ల దెబ్బతినడం ప్రజలకు నిద్రలేకపోవడంలాంటివి తీవ్ర సమస్యలుగా మారాయి."రాత్రి నిద్రపోవడం కష్టమవుతోందిడ పిల్లలు, వృద్ధులు చాలా ఇబ్బంది పడుతున్నారు" అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎమ్మార్వో స్పందనడ చర్యలు ఎక్కడ?ఈ విషయంపై పి.సి.డబ్ల్యూ రిపోర్టర్ ఎమ్మార్వోను ఫోన్ ద్వారా సంప్రదించగా, "మేము చర్యలు తీసుకుంటాం"సిఐ గారికి సమాచారం ఇచ్చాం"అని సమాధానం ఇచ్చినట్లు సమాచారం .అయితే ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు కనిపించకపోవడం ప్రజల్లో అనుమానాలు పెంచుతోంది. ప్రభుత్వ పనులకు ఇసుక లేదుడ అక్రమ రవాణాకు ఓకే?గ్రామస్తులు లేవనెత్తుతున్న కీలక ప్రశ్న ప్రభుత్వ బస్సు డిపో నిర్మాణానికి ఇసుక పర్మిషన్ ఇవ్వలేదుఇతర ప్రభుత్వ పనులకు కూడా అనుమతులు ఇవ్వడం లేదుఅయితే అదే సమయంలో రాత్రిళ్లు అక్రమంగా ఇసుక రవాణా ఎలా జరుగుతోంది?ఇది అధికారుల వైఖరిపై తీవ్ర అనుమానాలకు దారితీస్తోంది.'ఇందిరమ్మ' పేరుతో ముసుగు? కొంతమంది "ఇందిరమ్మ" పేరును ముసుగుగా ఉపయోగించి ఈ అక్రమ రవాణా నిర్వహిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని ప్రజలు కోరుతున్నారు.ప్రజల డిమాండ్అక్రమ ఇసుక రవాణాను వెంటనే అరికట్టాలి రాత్రి ట్రాక్టర్ దందాను నిలిపివేయాలిబాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి అధికారుల పాత్రపై విచారణ జరపాలిఅని గ్రామస్తులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. చర్యలు లేకపోతే ఆందోళనలుతక్షణ చర్యలు తీసుకోక పోతే పెద్ద ఎత్తున నిరసనలు, రహదారి దిగ్బంధనలు చేపడతామని గ్రామ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# మేడారం గద్దెల వద్ద ప్రమాదం గాయపడ్డ బాలుడిని పరామర్శించిన బిఆర్ఎస్ నేతలు

**"నిర్లక్ష్యంతో బాలుడి జీవితం దెబ్బతింది" లక్ష్మణ్ బాబు ఆరోపణలు**

**25 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్**



**ములుగు జిల్లా, ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో సమ్మక్క గద్దెల వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలుడు యువాన్‌ను ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని కలిసి ఆత్మీయంగా పరామర్శిస్తూ వారి పరిస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు.గద్దె వద్ద ఆడుకుంటూ ప్రమాదంగత నెల 25వ తేదీన మేడారం సమ్మక్క గద్దె వద్ద ఆడుకుంటున్న సమయంలో పూజారి సిద్ధబోయిన రమేష్ కుమారుడు యువాన్ (6) ప్రమాదానికి గురయ్యాడు. గద్దెకు సంబంధించిన సైడ్ బండలు ఊడి పడడంతో బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు.వైద్య చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా,ఒక కాలు పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో తొలగించాల్సి వచ్చిందిమరో కాలుకు కూడా ఫ్రాక్చర్ కావడంతో పరిస్థితి విషమంగా ఉందిబాలుడి పరిస్థితి చాలా బాధాకరంగా ఉందని లక్ష్మణ్ బాబు పేర్కొన్నారు."నిర్లక్ష్యమే కారణం"మేడారం అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలు ఉన్నాయని బిఆర్ఎస్ పార్టీ తరఫున పలుమార్లు హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం, కాంట్రాక్టర్లు పట్టించుకోలేదని లక్ష్మణ్ బాబు విమర్శించారు."1000 ఏళ్ల చరిత్ర అని చెప్పుకునే కట్టడాల్లో ఇలాంటి నిర్లక్ష్యం కారణంగా ఒక చిన్నారి జీవితమే బలి అయింది" అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం డిమాండ్ఈ ఘటనలో గాయపడిన బాలుడి కుటుంబానికి25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలిఅని లక్ష్మణ్ బాబు డిమాండ్ చేశారు.విచారణకు డిమాండ్ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని,సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలనిభవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వంపై విమర్శలుఈ ఘటనకు ప్రభుత్వం, సంబంధిత మంత్రులు పూర్తి బాధ్యత వహించాలని లక్ష్మణ్ బాబు ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.బాధిత కుటుంబానికి బిఆర్ఎస్ అండసమ్మక్క-సారక్క పూజారి సిద్ధబోయిన రమేష్ కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని లక్ష్మణ్ బాబు భరోసా ఇచ్చారు పాల్గొన్నారుఈ కార్యక్రమంలోఏటూరునాగారం సర్పంచ్ కాకులమర్రి శ్రీలతబిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాకులమర్రి ప్రదీప్ రావుఎండి వాలి బాబాఇతర పార్టీ నాయకులుపాల్గొన్నారు.

# నాణ్యమైన ఆహారాన్ని అందించి వినియోగదారుల మన్ననలను పొందాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**చర్లపల్లిలో శ్రీరామ్ ఫుడ్స్ అండ్ రెస్టారెంట్ ఘనంగా ప్రారంభం**



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,ఏప్రిల్ 03 (పిసీడబ్ల్యూ న్యూస్) :** వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించి మన్ననలను పొందాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలో సెంట్రల్ జైల్ సమీపంలో శ్రీరామ్ ఫుడ్స్ అండ్ రెస్టారెంట్ ను మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, సింగిరెడ్డి ధనపాల్ రెడ్డి, కొత్త రామారావు పజ్జూరి పావని రెడ్డి, పొన్నాల దేవేందర్ రెడ్డి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంపై ఆధారపడకుండా సొంత నిధులతో ఎంతోమంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తున్న శ్రీరామ్ బేకర్స్ స్వీట్స్ ఫుడ్స్ రెస్టారెంట్ అధినేత కట్కూరి సుధా విజయ్ కుమార్ రెడ్డి లను ఈ సందర్భంగా అభినందించారు. మాజీమంత్రి మోత్కుపల్లి నరసింహులు మాట్లాడుతూ వ్యాపారంలో నాణ్యత, విశ్వాసం, వినియోగదారుల సంతృప్తి ఎంతో ముఖ్యమని తెలిపారు. మంచి ఆహారం, శుభ్రత, సరైన ధరలు ఉంటేనే వ్యాపారం దీర్ఘకాలం విజయవంతంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత గణేష్ రెడ్డి, సాయి జెన్ శేఖర్, బిఆర్ఎస్ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మురళి పంతులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె. సీతారాం రెడ్డి, చీర్యాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఫౌండర్ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ, కీసర శ్రీ రామలింగేశ్వర దేవస్థానం చైర్మన్ తటాకం వెంకటేష్, సర్కిల్ ఇన్ స్పెక్టర్లు భాస్కర్ రెడ్డి (కుషాయిగూడ), ఆర్కపల్లి ఆంజనేయులు (కీసర), సుధాకర్ (చర్లపల్లి) తదితరులు హాజరయ్యారు.అతిథులు విజయ్ కుమార్ రెడ్డికి కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ ప్రతిమను బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త రెస్టారెంట్ ద్వారా స్థానికులకు మంచి నాణ్యమైన ఆహారం అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# ప్రజా సేవ చేశారు కబ్జాలు చేయలేదు: బోసాని పవన్ కుమార్

**ఉప్పల్ నారపల్లి కారిడార్ కు బండారి రాజిరెడ్డి పేరు పెట్టినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు**

**సొంత నిధులతో ఇప్పటివరకు ప్రజా సేవ చేశారా...?**

**రాజకీయ లబ్ధి కోసం మాట్లాడం కాదు ప్రజల మనసులో నుంచి పేరు రావాలి**

**కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా బండారి రాజిరెడ్డి పేరు పెట్టడం శుభ సూచకం**



**ఉప్పల్ ఏప్రిల్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** ఉప్పల్ నుండి నారపల్లి వరకు నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్ కు బండారి రాజిరెడ్డి పేరు పెట్టడం ఎంతో శుభసూచకమని ఉప్పల్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు బోసాని పవన్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బండారి రాజిరెడ్డి సేవలను గుర్తించి ఉప్పల్ నుంచి నారపల్లి వరకు నిర్మిస్తున్న కారిడార్ కు బండారి రాజిరెడ్డి పేరు ను అసెంబ్లీలో ఆమోదించినందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని అన్నారు. ప్రజా సేవ చేయడంలో బండారి రాజిరెడ్డి కి ఎవరు సాటి లేరని సొంత నిధులతో ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేసిన ఘనత రాజిరెడ్డికి దక్కుతుందని, మాజీ మున్సిపల్ చైర్మన్ గా, టీటీడీ బోర్డు మెంబర్ గా ప్రజల కోసం ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, అన్ని రాజకీయ పార్టీల నాయకులు బండారి రాజిరెడ్డి పేరు పై సంతోషం వ్యక్తం చేయగా ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ బండారి రాజిరెడ్డి పేరును వ్యతిరేకించడం మానుకోవాలని ప్రజల కోసం పోరాడిన నాయకుడు అలాంటి వ్యక్తి పేరును వ్యతిరేకించడం మానుకోవాలని, రాజకీయ లబ్ధి కోసం మాట్లాడడం సరికాదని, ప్రజల అభివృద్ధికై ప్రజా సంక్షేమానికై పాటుపడాలని మనం ఉన్నా లేకున్నా చిరస్థాయిగా మన పేరును ప్రజలు గుర్తుంచుకోవాలని, అధికారంలో ఉన్నప్పుడు ప్రజాసేవ చేయకుండా ఆస్తులను సంపాదించి కబ్జాలకు పాటుపడే నాయకులకు ప్రజలు బుద్ధి చెప్తారని, చిల్లర రాజకీయాలు మానుకోవాలని ప్రజా సంక్షేమానికై పాటుపడాలని బండారి రాజిరెడ్డి చూపిన బాటలోనే ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ప్రజా సేవ చేస్తున్నారని బండారి లక్ష్మారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంతో మంది విద్యార్థులకు చదువులు చెప్పిస్తున్నారని, అన్నా అంటే నేనున్నానని ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజా సమస్యలపై స్పందించి ఎక్కడికక్కడ సమస్యలపై అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకుడు బండారి లక్ష్మారెడ్డి అని అలాంటి వారిపై లేనిపోని మాటలు మాట్లాడితే చూస్తూ ఎవరు ఊరుకోరని ప్రజలకు సేవ చేయాలన్న బాధ్యత ఉండాలని అలీ కేఫ్ నుండి నాగోల్ మెట్రో స్టేషన్ వరకు 100 ఫీట్ల రోడ్డును వేయించిన ఘనత బండారి రాజిరెడ్డి కే దక్కుతుందని ఉప్పల్ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత కారిడార్ కు ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి పేరు పెట్టడం ఆయన చేసిన సేవలకు నిదర్శనమని సేవా కార్యక్రమాలు చేసిన ఘనత బండారి రాజిరెడ్డి కే దక్కుతుందని ఈ సందర్భంగా బోసాని పవన్ కుమార్ అన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తా...: కలెక్టర్ రాజర్షి షా

- వినతి పత్రాన్ని అందజేసిన టీఎస్ జె యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల్ అనిల్ కుమార్ జిల్లా నాయకులు
- అదిలాబాద్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,ఏప్రిల్ 03(పిసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జెయు) అదిలాబాద్ జిల్లా నూతనంగా ఎన్నికైన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సమావేశ కార్యాలయంలో కలెక్టర్ రాజర్షి షాను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు రాగం సుభాష్, ప్రధాన కార్యదర్శి మేడపట్ల సాయన్న, ఉపాధ్యక్షులు పసుపుల స్వామిలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను యూనియన్ నాయకులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇందులో ప్రధానంగా అర్హులైన జర్నలిస్టుల అందరికీ అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయడం తోపాటు హెల్త్ కార్డులు అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో చెల్లుబాటు అయ్యేవిధంగా చూడాలని కోరారు. అర్హులైన జర్నలిస్టుల అందరికీ ఇల్లు, ఇంటి స్థలాలు ఇవ్వవలసిందిగా కోరారు. దీనిలో భాగంగా జర్నలిస్టులపై దాడులు జరుగుతున్న సందర్భంలో అటాక్స్ కమిటీని జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసి రక్షణ కల్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని, వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని హామీ ఇచ్చారు. యూనియన్ కోశాధికారి అమృత్, ప్రచార కార్యదర్శి మిలింద్, యూనియన్ గౌరవ అధ్యక్షులు నరేష్ కదం, సహాయ కార్యదర్శి ఆర్క సంతోష్ తో పాటు మిగతా సభ్యులు దీపక్ ఎముర్లవార్, అనిల్ పవర్, అడ్డిగం మోహన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం ప్రెస్‌క్లబ్ వార్షిక శ్వేత పత్రం విడుదల

- హర్షం వ్యక్తం చేసిన జర్నలిస్టులు




**ఖమ్మం, ప్రతినిధి ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఖమ్మం ప్రెస్ క్లబ్ పాలకమండలి వార్షిక ఆదాయ, వ్యయాల శ్వేత పత్రాన్ని విడుదల చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వార్షిక ఆదాయ వ్యయాలను టి యు డబ్ల్యూ జే (ఐజేయు), టి యు డబ్ల్యూ జే (టి జే ఎఫ్) ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నామ పురుషోత్తం, గుద్దేటి రమేష్ బాబు లు వెల్లడించారు. ఏప్రిల్ 2025 నుంచి మార్చి 2026 వరకు ఈ 12 నెలల కాలంలో 74 ప్రెస్ మీట్ల కు గాను 1,06,500 ఆదాయం లభించిందని, వీటిలో వర్కర్ జీతం, కరెంటు బిల్లు, వాటర్ బిల్లు, మైక్ సెట్ ల కొనుగోలు, విద్యుత్ పరికరాల కొనుగోలు, ప్రెస్ క్లబ్ కు అవసరమైన స్టేషనరీ తదితర కొనుగోళ్లకు రూ.75,756 రూపాయలు ఖర్చు అయినట్లు తెలిపారు. వీటిల్లో ఈ ఏడాది రూ.30,744 రూపాయలు మిగులు బడ్జెట్ గా లభించిందని ప్రకటించారు. ప్రెస్ క్లబ్ అభివృద్ధికి ప్రతి జర్నలిస్ట్ తమ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ కమిటీలు వార్షిక ఆదాయ, వ్యయాల శ్వేత పత్రాన్ని విడుదల చేయటం పట్ల జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టి యు డబ్ల్యూ జే (ఐ జే యు) ప్రెస్ క్లబ్ కార్యదర్శి శీలం శ్రీనివాస్, టి యు డబ్ల్యూ జే (టిజేఎఫ్) ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు పి. పానకాలరావు, రేపాక యాదగిరి, పులి శ్రీను, ప్రచార కార్యదర్శి కూరపాటి నరేష్, కమిటీ సభ్యులు మురళి, ఉల్లోజు రమేష్, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, శంకర్, ఐజేయు రామారావు, తదితరులు పాల్గొన్నారు.

# అణగరణ వర్గాల నాయకుడు దొడ్డి కొమరయ్య: రేపు నరసింహ కురుమ దొడ్డి కొమరయ్యకు ఘన నివాళి



**ఉప్పల్ ఏప్రిల్ 04(పిసిడబ్ల్యూ న్యూస్):** ఏప్రిల్ 3 : అణగారిన వర్గాల నాయకుడు, అమరజీవి దొడ్డి కొమరయ్య జయంతిని పురస్కరించుకొని శుక్రవారం రామంతపూర్ మినీ ట్యాంక్ బండ్ పై ఆయన సేవలను కొన్ని ఆడుతూ పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా రేపు నరసింహ కురుమ మాట్లాడుతూ నిజాం నిరంకుశ రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మొట్టమొదటిగా అమరుడైన గొప్ప నాయకుడు దొడ్డి కొమురయ్య అని అన్నారు. అయినా చూపిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని, సంఘ అభివృద్ధికై ప్రతి ఒక్కరం పాటుపడాలని మహనీయులు చూపిన బాటలో మనమందరం పయనించాలని ఈ సందర్భంగా అన్నారు. దొడ్డి కొమరయ్యకు నివాళు లు అర్పించిన వారిలో ఉప్పల్ కురుమ సంఘం అసెంబ్లీ అధ్యక్షులు రేవు కృష్ణయ్య కురుమ, కురుమ సంఘం రామంతపూర్ అధ్యక్షులు రావుల జంగయ్య కురుమ, రామంతపూర్ బీరప్ప దేవాలయం చైర్మన్ సాగర్ రవి కురుమ, బాలమ్ రవి కురుమ, రావుల బీరప్ప కురుమ, బడక శ్రీధర్ కురుమ, బడక కృష్ణ కురుమ, కాడే యాదయ్య కురుమ, సాగ శ్రీను కురుమ తదితరులు పాల్గొన్నారు.

# సంజీవ సిలువ మార్గంతో పురవీధుల్లో భక్తి పారవశ్యము













## గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహణ

**కల్లూరు, ఏప్రిల్ 3 (పిసిడబ్ల్యున్యూస్) :**గుడ్ ఫ్రైడే సందర్భంగా కల్లూరు మున్సిపాలిటీలో సంజీవ సిలువ మార్గం కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడింది. యేసు క్రీస్తు అనుభవించిన శ్రమలు, త్యాగం, ప్రేమను ప్రతిబింబించే ఈ కార్యక్రమం పురవీధుల్లో ఆవేదనతో కూడిన భక్తి వాతావరణాన్ని సృష్టించింది. కల్లూరు విచారణ గురువులు రెవ. ఫా. సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాఘమయి దయానంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ యేసు చూపిన ప్రేమ, క్షమ, త్యాగం ప్రతి ఒక్కరూ జీవితంలో ఆచరించాలని సూచించారు. ఈ సందర్భంగా పురవీధులలో 14 స్థలాలను ఏర్పాటు చేసి, యేసు ప్రభువు అనుభవించిన బాధలను సజీవ రూపంలో ప్రదర్శించారు. కొరడాలతో కొట్టబడటం, అవమానాలు ఎదుర్కొనడం, సిలువ మోసుకుంటూ వెళ్లడం వంటి ఘట్టాలు ప్రజలను కంటతడి పెట్టించాయి. ముఖ్యంగా అంబేద్కర్ సెంటర్ వద్ద 12వ స్థలంలో యేసు సిలువపై మరణించిన దృశ్యం హృదయాలను కదిలించింది. ఈ సందర్భంగా ఫాదర్ సురేష్ మాట్లాడుతూ యేసు నేర్పిన ప్రేమ, సేవ, త్యాగం మార్గాన్ని అనుసరించడం ద్వారానే సమాజంలో శాంతి నెలకొంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు పరిధిలోని పలు గ్రామాల నుండి భారీ సంఖ్యలో క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు. స్థానిక నేతలు, సంఘ ప్రతినిధులు, యువత, మహిళలు విశేషంగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మొత్తంగా గుడ్ ఫ్రైడే వేడుకలు కల్లూరులో భక్తి, ఆవేదన, ఆత్మీయతల సమ్మేళనంగా నిలిచాయి.

# మధ్యలో ఆగిపోతున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు

- చార్జింగ్ సమస్యలతో మార్గమధ్యలో నిలిచిపోతున్న బస్సులు
- అడవి మార్గాల్లో ఆగిపోతే పరిస్థితి ఏంటి? ప్రజల ఆందోళన



**ములుగు జిల్లా, ఏప్రిల్ 04(పిసిడబ్ల్యూ న్యూస్): ఏప్రిల్ 3 :** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో హనుమకొండ నుంచి మంగపేటకు నడుస్తున్న ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులు తరచూ మధ్యలో నిలిచిపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.చార్జింగ్ సమస్యతో మధ్యలోనే నిలిచిన బస్సుతాజాగా ఒక ఆర్టీసీ బస్సు చార్జింగ్ పూర్తిగా లేకపోవడంతో మార్గమధ్యలోనే ఆగిపోయింది. బస్సులో ప్రయాణిస్తున్న ప్రజలు గంటల తరబడి ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు సమాచారం.ప్రయాణికుల భయం అడవి మార్గాల్లో ప్రమాదంఈ రూట్‌లో కొన్ని ప్రాంతాలు అడవులతో ఉండటంతో, రాత్రివేళల్లో బస్సు ఆగిపోతే భద్రత సమస్యలు తలెత్తే అవకాశం ఉందని మహిళలు, వృద్ధులు మరింత భయాందోళనకు గురవుతున్నారనిప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సరైన ప్లానింగ్ లేకపోవడమే కారణమా?ఎలక్ట్రిక్ బస్సులు నడిపే ముందుసరైన చార్జింగ్ సౌకర్యాలుమార్గమధ్యలో బ్యాకప్ ఏర్పాట్లులాంటివి లేకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు వస్తున్నాయని ప్రయాణికులు అంటున్నారు.ఆర్టీసీపై ప్రజల ఆగ్రహం“ప్రజల సౌకర్యం కోసం తీసుకొచ్చిన ఎలక్ట్రిక్ బస్సులు ఇలా ఇబ్బందులు పెడితే ఎలా?” అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ప్రజల డిమాండ్ ఎలక్ట్రిక్ బస్సుల చార్జింగ్ సదుపాయాలు మెరుగుపరచాలి మధ్యలో ఆగిపోకుండా సరైన ప్రణాళికతో బస్సులు నడపాలిప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించాలిఅని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.అధికారులు వెంటనే స్పందించాలిఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆర్టీసీ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# పశు వైద్యశాలకు తల్లిదండ్రుల పేరున భూమిని విరాళంగా ఇచ్చిన రైతు

- తను పడిన కష్టం గ్రామ రైతులు పడకూడదని ఆవేదన
- మండల ఎంపీడీవో, గ్రామ సర్పంచికి వివరణ ఇచ్చిన గ్రామ రైతు



**తొర్రూరు ప్రతినిధి ,ఏప్రిల్ 3(పీసిడబ్ల్యూ న్యూస్):** గ్రామాలలో రైతులకు ఎన్నో రకాల వసతులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు పడే కష్టం ఎవరికి చెప్పుకోలేని విధంగా ఉందని గ్రామ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తను యాదవ్ అని తనకున్న సంపద మూగజీవాలను పక్క గ్రామంలో ఉన్న కుందూరు సోమవారం గ్రామపంచాయతీ లోని పశు వైద్యశాలకు తీసుకువెళ్లగా తనకున్న మూగజీవాలు మేకలు గొర్రెలు అనారోగ్యానికి గురవినాయని ఎంతో కష్టపడి వైద్యశాలకు వెళితే నిరాశే మిగిలిందని ఈ విషయాన్ని మండల ఎంపీడీవో వెంకటేశ్వర్ల కు, గ్రామ సర్పంచ్ విసం పల్లి కవితా బాలకృష్ణకు గురువారం జరిగిన గ్రామ సభలో విషయాన్ని వెల్లడించారు. పశు వైద్యశాలలో ఉన్న వైద్యులు మందులు లేవని తెలపడంతో చావు బతుకులో ఉన్న తన సంపాదన తిరిగి ఇంటికి తీసుకురావడం జరిగిందని పక్క గ్రామానికి వెళితే ఇలాంటి పరిస్థితి ఎదురు కావటం ఎంతో బాధ కలిగించిందని తన ఆవేదనను వెళ్ళబుచ్చారు. మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని గుర్తుర్ గ్రామపంచాయతీ రైతు ఎర్నాగి శ్రీశైలం తనకున్న భూమిలో పశు వైద్యశాలకు కావలసినంత భూమిని తన తల్లిదండ్రుల పేరుతో విరాళంగా ఇస్తున్నానని గ్రామసభ సమావేశం లో వెల్లడించారు. స్థలాన్ని ఇస్తున్నానని హామీ ఇచ్చారు. తన తల్లిదండ్రులు కరోనా వ్యాధి వలన మృతి చెందారని వారి ఇద్దరి పేరున పశువైద్యశాలను ఏర్పాటు చేసి గ్రామ రైతులందరికీ మేలు చేసే విధంగా వైద్యశాల నిర్మించాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లను ఆయన కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంపీడీవో త్వరలో భూమిని రిజిస్ట్రేషన్ చేయించి పరుశువైద్యశాలను ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. గ్రామస్తులకు ఇబ్బంది కలగకుండా పశువైద్యకుచాలకు ఇచ్చినందుకు గ్రామ రైతులే కాకుండా పలువురు అధికారులు కూడా శ్రీశైలం కు కృతజ్ఞతలు తెలిపారు. తను ఇచ్చిన భూమిలో పశు వైద్యశాల నిర్మిస్తారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

# బడిబాట కార్యక్రమంలో వెల్లంకి ఉపాధ్యాయులు






**రామన్నపేట ఏప్రిల్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** రామన్నపేట మండలం ప్రాథమిక పాఠశాల వెల్లంకి ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని గుడ్ ఫ్రైడే సెలవు అయినప్పటికీ కూడా విద్యార్థులతో కలిసి నిర్వహించడం జరిగింది. ముందుగా బడిబాట కార్యక్రమం యొక్క కరపత్రమును గ్రామ సర్పంచ్ ఇడెం రాధా శ్రీనివాస్ కరపత్ర దాతలు బత్తుల శ్రీనివాస్ , ఏఏపిసి చైర్ పర్సన్ పులగం సులోచన , పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లె మోహన్ రెడ్డి లు సంయుక్తంగా ఆవిష్కరించడం జరిగింది. తదుపరి బడిబాట కార్యక్రమం లో భాగంగా గ్రామంలో ప్రతి ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలో వారి పిల్లలను చేర్పించాలని కోరడం జరిగింది. వారి నుండి మంచి స్పందన రావడం జరిగింది. వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఈడెం రాధా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విలువైన ఉచిత విద్య లభిస్తుందని తెలియజేయడం జరిగింది అదేవిధంగా ప్రతి తల్లిదండ్రులు ఆలోచించి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి పాఠశాల బలోపేతానికి సహకరించాలని కోరడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఇట్టే సోమిరెడ్డి , ఉయ్యాల బిక్షమయ్య , దూదిగామ సువర్ణ , మందుగుల వెంకటయ్య , కొసన మాధవి, నకిరేకంటే అశ్విని పాల్గొనడం జరిగింది.

# ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాలు

## కొడకండ్ల అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన GMPS నాయకులు



**కొడకండ్ల ఏప్రిల్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** తొలి రైతాంగ పోరాట యోధుడు, వీరశైవ లింగబలిజ వీరుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు కొడకండ్ల మండల కేంద్రంలో శుక్రవారం అత్యంత వైభవంగా జరిగాయి. గ్రామ ఉమ్మడి ఆస్తుల పరిరక్షణ సమితి (GMPS) ఆధ్వర్యంలో స్థానిక అమరవీరుల స్తూపం వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా GMPS జనగామ జిల్లా సహాయ కార్యదర్శి బొమ్మెరబోయిన శివ కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, భూమి కోసం, భుక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం వెలకట్టలేనిదని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్, GMPS మండల అధ్యక్షులు గుడెల్లి కొమరయ్య పాల్గొని దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ జయంతి ఉత్సవాల్లో దూదిమెట్ల యాకేష్ యాదవ్, కోట రాజు, బొమ్మెరబోయిన బిక్షపతి, నాయిని కనకయ్య, బొల్లి అంజయ్య, కోట దామోదర్, ఎల్లంల అనిల్, కోట శ్రీను, బట్టు వెంకన్న, బుల్లి కొమరయ్య, కోట వివేక్, పులిగిల్ల గంగరాజు, ఆది వీరన్న, కోట చిన్న లింగన్న తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

# బొమ్మకల్ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం: ఇద్దరు యువకుల మృతి



**కరీంనగర్ జిల్లా ఏప్రిల్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరం బొమ్మకల్ శివారులో గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాద వివరాలు:గురవారం రాత్రి సుమారు 10:15 గంటల ప్రాంతంలో తీగలవంతెన వైపు నుండి అతివేగంతో వస్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు (నెం. ఖా 02 జు 3223), బొమ్మకల్ శివారులోని సమీర్ దాబా ముందు పార్క్ చేసి ఉన్న లారీని (వా.నెం. BR 21 GD 2168) వెనుక నుండి బలంగా ఢీకొట్టింది. కారు అతివేగంగా ఉండటంతో లారీ కిందకు దూసుకుపోయింది.కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు.మృతులు: 1. సయ్యద్ అబ్దుల్ రెహమాన్ (19), కరీంనగర్. 2. సయ్యద్ అతియాబ్ హుస్సేన్ (21), కరీంనగర్ (డ్రైవర్). క్షతగాత్రులు: 1. మహమ్మద్ అద్నాన్ (18): తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. 2. మహమ్మద్ అబ్రార్ (20): స్వల్ప గాయాలతో కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.సి.పి. పర్యవేక్షణ:కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవార ఉదయం స్వయంగా ఘటనా స్థలాన్ని సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును స్థానిక రూరల్ ఏసీపీ విజయ కుమార్ మరియు రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డి లను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.ప్రస్తుతం ఘటనా స్థలంలో పరిస్థితి ప్రశాంతంగా ఉందని, అతివేగమే ఈ ప్రమాదానికి ప్రాథమిక కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ ఇన్స్పెక్టర్ తెలిపారు.

# ఘనంగా బ్లూమ్స్ ది గ్లోబల్ స్కూల్ 18వ వార్షికోత్సవ వేడుకలు








**హన్మకొండ ఏప్రిల్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** బ్లూమ్స్ ది గ్లోబల్ స్కూల్ యొక్క 18వ వార్షికోత్సవ వేడుకలు రెడ్డి కాలనీలోని శారదా ఫంక్షన్ హాల్‌లో అత్యంత ఉత్సాహంగా వైభవంగా విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖ ముఖ్య అతిథులు విచ్చేసి కార్యక్రమాన్ని అలంకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పశ్చిమ వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,5వ డివిజన్ కార్పొరేటర్ పోతుల శ్రీమాన్ నారాయణ,1వ డివిజన్ కార్పొరేటర్ అనిల్,వడుప్సా జిల్లా అధ్యక్షులు మాదాల సతీష్ కుమార్,శ్రీకాంత్,జిల్లా రేషన్ డీలర్ అధ్యక్షులు బత్తుల రమేష్ బాబు లు పాల్గొన్నారు. అతిథులందరూ విద్యార్థులను ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, జీవితంలో విజయం సాధించేలా ప్రోత్సహిస్తూ స్ఫూర్తిదాయక ప్రసంగాలు చేశారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ నరేష్ మాట్లాడుతూ…ఈ వేడుకలో విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శనలు ఇవ్వగా,తల్లిదండ్రులు,అతిథులు వాటిని ఎంతగానో ప్రశంసించారు. తల్లిదండ్రుల చురుకైన భాగస్వామ్యం, సహకారం కార్యక్రమ విజయానికి దోహదపడ్డాయి అని చెప్పారు. ఈ కార్యక్రమం ఘనంగా జరగడానికి కారణం అంకితమైన ప్రయత్నాలు చేసిన ప్రిన్సిపాల్ కే. చందన,ఇంఛార్జ్ సాయినాథ్,బోధనా సిబ్బంది మమత,పార్వతి,శోభా రాణి,భవాని,లింగమూర్తి, రమాదే,సంధ్య, అర్చన,అయేషా,శిరీష,కోమల,చైతన్య అందరూ ఈ కార్యక్రమాన్ని ఘనవిజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు అని డైరెక్టర్ కె. నరేష్ తెలిపారు. ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన పూర్వ విద్యార్థి బి. నితిన్ హాజరు కావడం ఈ కార్యక్రమానికి ఒక ప్రత్యేక ఆకర్షణ అతను తన పాఠశాల జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, క్రమశిక్షణ,పట్టుదల యొక్క ప్రాముఖ్యతను నొక్కిచెబుతూ స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. అతను తన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు కూడా తెలియజేశారు. ప్రస్తుతం ప్రతిష్టాత్మక పదవులలో ఉన్న పలువురు పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరై,తమ విలువైన అనుభవాలను పంచుకుని, ప్రస్తుత విద్యార్థులకు స్ఫూర్తినిచ్చారు. యాజమాన్యం, సిబ్బంది,విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు పూర్వ విద్యార్థుల సమిష్టి కృషితో మొత్తం మీద ఈ కార్యక్రమం ఘన విజయం సాధించింది.

# ఘనంగా దొడ్డి కొంరయ్య జయంతి



**నర్సింహులపేట, ఏప్రిల్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి, కోసం వీరోచితంగా పోరాడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని నర్సింహులపేట లోని యాదవ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 99వ జయంతి సందర్భంగా దొడ్డి కొంరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ దొడ్డి కొంరయ్య స్ఫూర్తితో పోరాటాలు చేయాలని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నిజాం నిరంకుశ పాలనకు ఎదురొడ్డిన తొలి అమరుడు దొడ్డి కొంరయ్య అన్నారు. ధైర్యంగా పోరాడి అమరుడైన దొడ్డి కొంరయ్య సాహసాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి కాస యాకయ్య యాదవ్, కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రేఖ అనిల్ యాదవ్ , యూత్ కాంగ్రెస్ మండల యూత్ ప్రధాన కార్యదర్శి నిమ్మల శ్రీనివాస్ యాదవ్ , బీజేపీ మండలాధ్యక్షుడు సూరబోయిన సతీష్ యాదవ్ , హమాలీ సంఘం మండలాధ్యక్షుడు సూరబోయిన మల్లయ్య యాదవ్, యాదవ సంఘం నాయకులు రేఖ శ్రీను యాదవ్ , తండ యాకయ్య యాదవ్, సూరబోయిన వీరన్న యాదవ్ , వీరబోయిన అశోక్ యాదవ్ , బోగి అనిల్ , సమ్మెట రమేష్, భూక్య రెడ్యా, పలువురు యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



## రేషన్ కార్డ్ మంజూరు చేస్తానని మాటిచ్చి ...రెండు రోజుల్లో రేషన్ కార్డు మంజూరు చేయించి...బియ్యం ఇప్పించిన ఎమ్మెల్యే

**షాద్ నగర్,ఏప్రిల్ 03(పిసిడబ్ల్యూ న్యూస్):** రెండు రోజుల క్రితం నందిగామ మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కి రేషన్ కార్డ్ కోసం నందిగామకు చెందిన వృద్ధురాలు లక్ష్మమ్మ ఎమ్మెల్యేను మొరపెట్టుకుంది. అప్పుడు రేషన్ కార్డు ఇప్పిస్తానని ఆమెకు మాట ఇచ్చిన ఎమ్మెల్యే… ఇచ్చిన మాట ప్రకారం శుక్రవారం బాధితురాలు లక్ష్మమ్మకు రేషన్ కార్డు ఇప్పించారు. కేవలం మూడు రోజుల్లో సివిల్ సప్లై, రెవెన్యూ అధికారులతో మాట్లాడి రేషన్ కార్డు అందజేసి సన్న బియ్యం అందించిన ఎమ్మెల్యేకు లక్ష్మమ్మ ఆనందభాష్పాలతో.. చల్లగా బతుకు బిడ్డ అంటూ ఆశీర్వదించారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో నిరుపేదలను పట్టించుకున్న పాపాన పోలేదని, ఏ ఒక్కరికి కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదని, దోచుకొని దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అన్నింటిని విడతలవారిగా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఏం శివశంకర్ గౌడ్, ఆర్ ఐ శ్రీనివాస్, సర్పంచ్ కొమ్ము కృష్ణ,మార్కెట్ డైరెక్టర్ సి నర్సింలు,ఉప సర్పంచ్, వెంకటేష్ గౌడ్, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, అగ్గి మమత సూరి, శివగళ్ల సురేష్, బొమ్మగల్ల నర్సింలు, టైలర్ కృష్ణ, నాయకులు చంద్రపాల్ రెడ్డి, కావలి కృష్ణ,జిల్లెల్ల బాల్ రెడ్డి, పసుల బుచ్చయ్య, ఎదిరె శ్రీకాంత్ గౌడ్, కుందారం వెంకట్ రెడ్డి, చించేటి కృష్ణ, పిట్టల రాములు తదితరులు ఉన్నారు.



# ధనుష్ సెట్‌లో చాలా నిశ్శబ్దంగా ఉంటాడు : సంయుక్త మీనన్



మలయాళ చిత్ర పరిశ్రమ నుండి వచ్చి, టాలీవుడ్‌లో వరుస విజయాలతో 'గోల్డెన్ లెగ్'గా గుర్తింపు తెచ్చుకున్న అందాల నటి... సంయుక్త మీనన్. బింబిసార, విరూపాక్ష వంటి చిత్రాలతో తెలుగు పరిశ్రమలో ఆమె స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. పవర్ స్టార్ పవన్ చిత్రం 'భీమ్లా నాయక్'తో సంయుక్త రేంజ్ నెక్స్ట్ లెవెల్ కి వెళ్లింది. తమిళనాడులో కూడా సంయుక్తకు భారీ ఫాలోయింగ్ ఉంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ... ధనుష్ సరసన 'సార్' (తమిళంలో వాతి) చిత్రంలో నటించిన అనుభవాన్ని ఆమె పంచుకుంది.

"ధనుష్ తో పనిచేయడం నాకు ఒక గొప్ప పాఠం లాంటిది. ఆయన సెట్‌లో చాలా నిశ్శబ్దంగా ఉంటారు. కానీ కెమెరా ముందుకు రాగానే అద్భుతమైన శక్తిని ప్రదర్శిస్తారు. ఆయన కథను ఎంచుకున్నారంటే అందులో కచ్చితంగా ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది" అని సంయుక్త ప్రశంసించింది.



భవిష్యత్తులో మళ్ళీ ఆయనతో కలిసి నటించాలనే కోరికను ఆమె వ్యక్తం చేసింది.

వెంకీ అట్లూరి దర్శకత్వంలో వచ్చిన 'సార్' చిత్రం విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతూ రూ. 100 కోట్లకు పైగా వసూళ్లను సాధించింది. ఇందులో మీనాక్షి అనే బోటనీ లెక్చరర్ పాత్రలో సంయుక్త ఒదిగిపోయింది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, కథాబలమున్న సినిమాలను ఎంచుకోవడమే తన విజయ రహస్యమని ఆమె స్పష్టం చేసింది.





# యోధుడిగా సాయి దుర్గ తేజ్..

## ఆసక్తి రేపుతున్న కొత్త సినిమా కాన్సెప్ట్ పోస్టర్!

సుప్రీం హీరో, మెగా మేనల్లుడు సాయి దుర్గ తేజ్ తన కెరీర్‌లో 19వ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. చూఋ19 అనే వర్కింగ్ టైటిల్‌తో రానున్న ఈ సినిమాకు సంబంధించిన కాన్సెప్ట్ పోస్టర్‌ను చిత్ర బృందం సోషల్ మీడియాలో విడుదల చేసింది. ఈ పోస్టర్ సినిమాపై ఒక్కసారిగా అంచనాలను పెంచేసింది. యుగాల నాటి రహస్యాలు, ఊహకందని శక్తుల నేపథ్యంలో ఈ చిత్రం ఉండబోతోందని స్పష్టమవుతోంది.విడుదలైన పోస్టర్‌లో సాయి తేజ్ ఒక దట్టమైన అటవీ ప్రాంతంలో శక్తివంతమైన యోధుడిలా నిలబడి ఆకాశం వైపు చూస్తూ కనిపించారు. ఆకాశంలో వింత మేఘాలు, ఒక రహస్య పర్వతం, కాంతి పుంజాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. దీనికి 'యుగాల నాటి రహస్యాలు.. ఊహకు అందని అపరిమితమైన శక్తి' అనే క్యాప్షన్ జోడించడంతో ఇదొక మైథలాజికల్ టచ్ ఉన్న కాస్మిక్ అడ్వెంచర్ డ్రామా అని తెలుస్తోంది. ఇటీవల 'క' చిత్రంతో విజయం సాధించిన యువ దర్శకులు సుజిత్, సందీప్ ఈ ప్రాజెక్ట్‌కు దర్శకత్వం వహించనున్నారు.

ఈ సినిమాతో సాయి తేజ్ నిర్మాతగా కూడా మారుతుండటం విశేషం. తన తల్లి పేరు మీద 'విజయదుర్గ ప్రొడక్షన్స్' అనే బ్యానర్‌ను స్థాపించి, ఈ చిత్రానికి నిర్మాణ భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. త్వరలోనే నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను వెల్లడిస్తామని చిత్ర యూనిట్ తెలిపింది.

# అద్దెకు స్వస్తి.. వాటా పద్ధతిలోకి సింగిల్ స్క్రీన్ థియేటర్లు



హైదరాబాద్‌లోని పలు సింగిల్ స్క్రీన్ థియేటర్లు కీలక నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పటివరకు కొనసాగిన అద్దె విధానానికి స్వస్తి పలికి, మల్టీప్లెక్స్‌ల తరహాలో పర్సెంటేజీ విధానంలో సినిమాలను ప్రదర్శించాలని నిర్ణయించాయి. నగరంలోని మొత్తం 23 థియేటర్లలో శుక్రవారం నుంచే ఈ కొత్త విధానం అమల్లోకి వచ్చినట్లు తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఓ ప్రకటనలో తెలిపింది.ఇంతకాలం సినిమా ప్రదర్శన కోసం పంపిణీదారులు థియేటర్ల యాజమాన్యాలకు రోజువారీగా లేదా వారానికి ఇంత అని అద్దె చెల్లించేవారు. అయితే పెరిగిన నిర్వహణ ఖర్చులు, సిబ్బంది జీతాలతో ఈ విధానం భారంగా మారిందని, థియేటర్ల మనుగడ కష్టమవుతోందని యాజమాన్యాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలోనే పర్సెంటేజీ విధానంలోకి మారాలని నిర్ణయించాయి.కొత్త విధానం ప్రకారం, సినిమా విడుదలైన మొదటి వారం వసూళ్లలో 60 శాతం, రెండో వారం 50 శాతం, మూడో వారం 40 శాతం చొప్పున వాటాను డిస్ట్రిబ్యూటర్లకు ఇవ్వనున్నారు. మిగిలిన వాటాను థియేటర్ యజమానులు తీసుకుంటారు. ప్రముఖ పంపిణీదారులు సునీల్ నారంగ్, శిరీష్ రెడ్డి వంటి వారు ఈ నిర్ణయానికి మద్దతు తెలిపారు. అయితే, మైత్రీ మూవీ మేకర్స్‌కు చెందిన పంపిణీదారు శశిధర్ రెడ్డి ఈ కొత్త నిబంధనలకు అంగీకరించలేదని సమాచారం.ప్రస్తుతానికి 23 థియేటర్లతో ప్రారంభమైన ఈ విధానాన్ని, భవిష్యత్తులో దశలవారీగా తెలంగాణలోని అన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లకు విస్తరించనున్నట్లు ప్రదర్శనకారులు తెలిపినట్టు ఫిల్మ్ ఛాంబర్ తన ప్రకటనలో పేర్కొంది.

# సోషల్ మీడియా క్వీన్‌గా హెబ్బా సందడి





: సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, హెబ్బా సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తన రెగ్యులర్ అప్డేట్స్, వెకేషన్ ఫోటోలు మరియు గ్లామరస్ ఫోటోషూట్‌లను ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌తో పంచుకుంటూ ఉంటుంది. అందుకే ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోయింగ్ కూడా భారీగానే ఉంది. తాజాగా చేసిన ఈ బోల్డ్ ఫోటోషూట్ ఆమె ఫ్యాషన్ సెన్స్‌ను మరోసారి నిరూపించింది. ట్రెండీ అవుట్‌ఫిట్‌లను క్యారీ చేయడంలో తనకు సాటి ఎవరూ లేరని ఈ చిన్నది మరోసారి ప్రూవ్ చేసుకుందిప్రస్తుతం హెబ్బా పటేల్ కేవలం సినిమాలకే కాకుండా వెబ్ సిరీస్‌లపై కూడా దృష్టి పెడుతోంది. నటనకు స్కోప్ ఉన్న పాత్రలను ఎంచుకుంటూనే, అప్పుడప్పుడు స్పెషల్ సాంగ్స్‌లో మెరుస్తూ తన గ్లామర్ పవర్‌ను చూపిస్తోంది. కెరీర్ ఆరంభంలో వచ్చినంత సక్సెస్ ఇప్పుడు లేకపోయినప్పటికీ, తన క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని తాజాగా వైరల్ అవుతున్న ఫోటోలే సాక్ష్యం. భవిష్యత్తులో మరిన్ని విభిన్నమైన ప్రాజెక్టులతో తెలుగు ప్రేక్షకులను పలకరించేందుకు హెబ్బా సిద్ధమవుతోంది. గ్లామర్ తో గెలుస్తున్న కుమారి: హెబ్బా పటేల్ తన బోల్డ్ లుక్స్‌తో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉండటం కొత్తేమీ కాదు. కానీ ఈ సమ్మర్ లో ఆమె ఇస్తున్న స్టిల్స్ మాత్రం నెక్స్ట్ లెవల్‌లో ఉన్నాయి. తన అందచందాలతో సోషల్ మీడియాను షేక్ చేస్తున్న ఈ కుమారి రాబోయే సినిమాలతో బాక్సాఫీస్ వద్ద కూడా ఇలాగే అదరగొట్టాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇక ఏది ఏమైనా, తన గ్లామర్ దాడితో హెబ్బా మరోసారి ఇంటర్నెట్ సెన్సేషన్ అయిపోయింది.

# మగవాళ్లకు ఒక రూల్.. ఆడవాళ్లకు ఒక రూలా?

## : సమాజంపై మంచు లక్ష్మి ఫైర్



ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్ బాబు తనయగా కాకుండా, నటిగా, నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న మంచు లక్ష్మి ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఇటీవల 'ఆదిపర్వం', 'దక్ష' చిత్రాలతో అలరించిన ఆమె, మార్చి చివరి వారంలో 'లేచింది మహిళా లోకం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె, మన సమాజం మహిళలను చూసే దృక్పథంపై నిప్పులు చెరిగారు.

సమాజం మహిళలను జడ్జ్ చేసే విధానాన్ని లక్ష్మి తప్పుబట్టారు. "మగవాళ్లు ఏదైనా బోల్డ్ నిర్ణయాలు తీసుకుంటే అది గొప్ప అని ప్రశంసిస్తారు. అదే ఆడవాళ్లు చేస్తే మాత్రం రకరకాలుగా మాట్లాడుకుంటారు. 'మేము చేస్తే సంసారం.. మీరు చేస్తే ఆ వ్యవహారం' అనే విధంగా ఉంటుంది. ఆ సామెతను నా నోటితో పూర్తిగా చెప్పను కానీ, మీకు అర్థమైందని అనుకుంటున్నాను" అని ఆమె చమత్కరిస్తూనే గట్టి కౌంటర్ ఇచ్చారు. ఆడవాళ్లు ఇలాగే ఉండాలి, ఇలాగే ప్రవర్తించాలి అని రూల్స్ రాసింది ఎవరని ఆమె ప్రశ్నించారు.తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి ఒక ఆసక్తికర విషయాన్ని లక్ష్మి పంచుకున్నారు. "నా పెళ్లి సమయంలోనే నా భర్తకు ఒక మాట చెప్పాను. నువ్వు ఏ పని చేస్తావో.. అదే పని నేను కూడా చేయగలను అని గుర్తుంచుకోమన్నాను" అని తెలిపారు. తన మాటల ప్రభావమో ఏమో కానీ, తన భర్త ఏదైనా చేయడానికి జంకుతారని, తను చేస్తే లక్ష్మి కూడా చేస్తుందనే భయం ఆయన మనసులో ఉంటుందని ఆమె సరదాగా పేర్కొన్నారు.